శ్రీరస్తు

# సౌందర్యమంజరి

అభినవభావకావ్యము

కవిశేఖర

కాళ్లకూరి గోపాలరాయ

ప్రణీతము

ప్రకాశకులు: విశల్యా డిపోవారు

4, ఆచారప్పన్ సందు, జార్జిటవును

మదరాసు — 1934

First Edition 1, 500 Copies

మొదటి కూర్పు 1, 500 ప్రతులు

University of Hyderabad
LIBRARY
Acc. No. 29175
Dated 8.7.87
Hyderabad - 500 134.

Printed at the Andhra Patrika Press
and
Published by the Visalya Depot
4, Acharappan Lane, G. T., Madras

All Rights Reserved

సర్వస్వామ్యములు సంకలితములు



[illegible]

శ్రీ విక్రమదేవవర్మ మహారాజులుంగారు

శ్రీరస్తు

# సౌందర్యమంజరి

## విషయానుక్రమణిక


FOREWORD — Dr. Sir S. Radhakrishnan, Vice-Chancellor, Andhra University V

మున్నుడి — (ఆంధ్రీకరణము) ఆంధ్రవిశ్వకళాపరిషదుపాధ్యక్షులు డాక్టర్ సర్ యస్. రాధాకృష్ణను గారు VI

కావ్యపరిచయము — దేశోద్ధారక విశ్వదాతృ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు VII

,, ౨ — బారిస్టరు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారు XXXVII

ధన్యవాదములు — శ్రీశ్రీశ్రీ శ్రీవిక్రమదేవవర్మ మహారాజులుంగారు XXXIX

స్వవిషయము — గ్రంథకర్త XL

ఛాయాచిత్రము — సభాపతి కృతిభర్తృ కృతికర్తలు XLII

I సంకల్పము ... ... 1

II శక్త్యుపాసన ... ... 7

| | | | | |
|---|---|---|---|---|
| III | భాషోపాసన | ... | ... | 13 |
| IV | రసోపాసన | ... | ... | 19 |
| V | మన్మథోపాసన | ... | ... | 29 |
| VI | కుమారీస్వయంవరము | | ... | 45 |
| VII | కృతిసమర్పణము | ... | ... | 57 |

ప్రతిగ్రహమహోత్సవము — విద్వాన్ విశ్వనాథ నరసింహము గారు, బి. ఏ. 61

# FOREWORD

Mr. K. Gopala Rao read to me portions of his work, "Soundaryamanjari". His treatment of the subject is ingenious. To follow it with understanding, one should have a knowledge of both modern science and ancient thought of this country. Though I am not competent to offer my judgment on his work in its literary side, I venture to say that his style is both elegant and dignified. The dedication of the work to the Rajah Saheb of Jeypore, who has endeared himself to the Andhra Public by his magnificient donation to the Andhra University, is quite appropriate.

Waltair
23-5-'32

S. RADHAKRISHNAN

*(Vice-Chancellor, Andhra University)*

# మున్నుడి

(ఆంధ్రీకరణము)

శ్రీ కాళ్లకూరి గోపాలరావు గారు తమ సౌందర్యమంజరి నుండి కొన్ని భాగములను నాకు వినిపించిరి. వస్తుసంవిధానచాతుర్య మపూర్వము, ప్రతిభావంతము. దానిని వివేచనతో గ్రహింపవలయు నన్న, ఆధునిక భౌతికశాస్త్రజ్ఞానమును భారతీయసనాతనభావపరిచయమును ఆవశ్యకములు. ఈ కావ్యమును గుఱించి సాహిత్య గుణనిరూపణము గావించుటకు నేను సమర్థుఁడను గాక పోయినను, శైలి రంజకమును గంభీరము నై యున్న దని చెప్ప సాహసించుచున్నాను. ఆంధ్రవిశ్వకళాపరిషత్తునకు హేరాళ మైన విరాళ మొసంగి యాంధ్రప్రజల చిత్తము చూఱగొన్న శ్రీ జయపురము రాజా గారికీ గ్రంథము నంకితము గావించియుండుట యెంతయు సమంజసము.

వాల్తేరు
23-5-'32

యస్. రాధాకృష్ణన్
(ఆంధ్రవిశ్వకళాపరిషదుపాధ్యక్షుఁడు)

శ్రీరస్తు

# సౌందర్యమంజరి

## కావ్యపరిచయము

### ఉపోద్ఘాతము

అవ్యక్తవ్యక్తముల స్వభావస్వరూపసత్యానుభూతి యోగము, పరమార్థము, పురుషార్థము, రసానందము, బ్రహ్మానందము.

అవ్యక్తము — నిర్గుణము, నిరాకారము, నిరంజనము — పంచవింశతి తత్త్వాధారమున సువ్యక్తమగుచున్నది. అఖండమైన యవ్యక్తము అనంతములైన శాంతశివసుందరరూపముల సువ్యక్తమై సుఖదుఃఖ సాధనం బగుచున్నది. పృథివ్యప్తేజోవాయ్వాకాశములు, పంచతన్మాత్రలు, శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వాఘ్రాణేంద్రియములు, వాక్పాణిపాదపాయూపస్థములు, మనోబుద్ధిచిత్తాహంకారములు, మహత్తు — ఇవి పరస్పర సంయోగవియోగముల విశ్వపరిణామమును పొందుచున్నవి. పరమాణువు మొదలు పరబ్రహ్మము వఱకును వ్యాప్తమైన చరాచర ప్రపంచ మంతయు సద్యోగాశ్రయమై జీవితపరమార్థమైన పురుషార్థము నభిలషించుచున్నది. సద్యోగము చిద్యోగభావనను, చిద్యోగమానందయోగభావరూపములను, విశ్వశ్రేయస్సునకు సాధనముగ నున్నవి. సచ్చిదానందశ్రుతిబద్ధమును, శాంతశివసుందరాంగబద్ధమును, నాదబిందుకళానుసంధానమును, ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తిరూపమును, సత్త్వరజస్తమోగుణావృతమును నైన ధర్మయోగము బ్రహ్మాండధారణమును జేయుచున్నది. పిపీలికాదిబ్రహ్మపర్యంతము గల బ్రహ్మాండము

ఆత్మధర్మోద్ధరణసాధనమున బ్రహ్మాండోద్ధరణమును జేయుచు నాత్మరసానందమును బడయుచున్నది.

దేహధర్మక్షేత్రమునందు పరిమితముగ నున్న శక్తి నపరిమితముఁ జేసి సర్వాత్మత్వమును పరిస్ఫుటము చేయుట సకలయోగములకును కావ్యములకును ధర్మములకును పరమార్థము. సకలసాధనములు నీ పరమార్థమునకు వినియోగపడుచున్నవి. శక్తి సృష్టిపరిణామమునందు క్షేత్రధర్మముల కనురూపముగ పరిమితవికాసమును బొందుచున్నది. ఆకాశతత్త్వమునం దనంతకాంతులు గలిగియున్న పరాశక్తి, సహస్రారమునందు సహస్రరేఖాకాంతులను, పృథ్వీతత్త్వమునందు పరిమితము లైన రేఖాకాంతులను గలిగి, పరిమిత మైన శక్తిని గలిగియున్నది. పరిమిత మై స్వతస్సిద్ధముగను ప్రక్షిప్తముగను నున్న శక్తి నపరిమిత మైన శక్తిగ పరిణమింపఁజేయుట సకలయోగసాధనములకును ప్రయోజనము. ఊర్ధ్వముఖము లై వికసితము లైన శక్తులు సృష్టిపరిణామమునం దధోముఖము లై ముకుళితము లగుచున్న విధమును కుండలినీశక్తి విశదము చేయుచున్నది. బ్రహ్మాండములందును పిండాండములందును అధోముఖములును ముకుళితములును నైన శక్తికమలస్థానము లూర్ధ్వముఖములును వికసితములును నగునప్పుడనంత మైన శక్తికి సర్వవ్యాపకత్వము గలిగి సకలాభీష్టములును సిద్ధించుచున్నవి. పృథివ్యప్తేజోవాయ్వాకాశతన్మాత్ర లంతర్లయమును బొందునప్పు డఖండ మైన కుండలినీశక్తి ఆకాశతత్త్వస్థాన మైన సహస్రారమునందువలె, పృథ్వీతత్త్వస్థాన మైన మూలాధారస్థానమునందును యథార్థముగ ప్రజ్వలనమును పొంది, పృథ్వీబీజ మైన 'లం' కారమందును ఆకాశబీజ మైన ఓంకారమందును పరిస్ఫుట మగుచున్నది.

నాదస్వరూప మైన ఓంకారము సప్తకమలసంస్థిత మైన చిచ్ఛక్తి నేకశ్రుతియందు మేళగించి ఆత్మానందమును సమకూర్చు

చున్నది. నిగమాగమములకును మంత్రములకును తంత్రములకును శాస్త్రములకును కావ్యములకును యోగములకును కళలకును మూలాధార మైన ఓంకారము కుండలినీశక్తియోగసిద్ధికి సాధనభూతముగ నున్నది.

విశ్వము ధర్మయోగబద్ధ మై పురుషార్థసిద్ధికి కర్మధర్మబ్రహ్మానుష్ఠానములను చేయుచున్నది. చతుర్విధపురుషార్థములకును ధర్మము కీలకము; అర్థకామములు ధర్మాధీనములు. ధర్మ మర్థకామాతీతము. ధర్మము విశ్వమును శ్రుతిగతిరాగరూపబద్ధముగ ధరించుచు, విశ్వశ్రేయస్సునకు సాధనముగ నున్నది. వేదములు వేదాంగములు శాస్త్రములు కావ్యములు పురాణేతిహాసములు కళలు యోగములు కర్మధర్మబ్రహ్మస్వభావస్వరూపపరిణామములు. వేదాంతము యోగము కావ్యములు కళలు కర్మకాండములు విశ్వసాహిత్యాంగములు. విశ్వసాహిత్యాంగములు భిన్నము లైనను, సకలాంగములకును లక్ష్యము పురుషార్థము. పురుషార్థమునకు ధర్మార్థకామమోక్షము లన్యోన్యాశ్రయము లై, ఆత్మానందమునకు సాధనముగ నున్నవి. అనంత మైన విశ్వసాహిత్యమును సాహిత్యోపాసకులు స్వసంకల్పసంస్కారానురూపముగ ధ్యానించి కీర్తించి వర్ణించి చిత్రించి, ఆత్మరసానందానుభవమున కధికారు లగుచున్నారు.

ప్రకృతిపురుషుల విలాసవైభవముల సంభావనసంసేవనవర్ణనసాధ్య మైన రసానందానుభవమునకు కావ్యము లుత్తమసాధనములు. జీవజాలములకు జీవయాత్రయందు సహజము లైన సుఖదుఃఖములు ప్రేమానురాగములు రాగద్వేషములు జయాపజయములు త్యాగభోగములు వీరశృంగారములు సౌందర్యవిలాసములు రసానందమును గలుగఁ జేయుటకు, కావ్యములు మనోహరసాధనములు. మహాకవులు రసోపాసకులు, రససిద్ధులు; భావసామ్రాజ్యమునకు పట్టభద్రులు; విశ్వకావ్యనిర్మాణమునకు బ్రహ్మలు; విశ్వమును నాదబిందుకళారాగరూపగతుల సంకల్పించుటకును నాడించుటకును పాడించుటకును సమర్థులు.

కావ్యములు కవుల సంకల్పసంస్కారానురూపములు. శ్రీమద్భాగవత భారత రామాయణాదులు వ్యాస వాల్మీకి పోతన తిక్కనాదులయు, మనుచరిత్ర రసికాభిలాషములు పెద్దన శ్రీనాథులయు, వేమన భాస్కర శతకములు వేమన వెంకనలయు సంకల్పసంస్కారముల కనురూపములు. సాహిత్యక్షీరార్ణవమునందు కావ్యామృత ముత్పన్న మయి కావ్యరసానందానుభవమునకు సాధనం బగుచున్నది. సాహిత్యార్ణవమునం దుత్పన్న మైన యనంతకావ్యములలో గుణదోషములు సహజములు. గుణగ్రహణపారీణు లనంతము లైన కావ్యములందు రసానందము ననుభవింపఁగలరు. విశ్వనిర్మాణమునకువలెనే కావ్యరచనకును ఇచ్ఛాశక్తి బీజము, జ్ఞానశక్తి శక్తి, క్రియాశక్తి కీలకము. సౌందర్యమంజరీకావ్యమునందు కృతికర్త సంకల్పించి వినిర్మించిన ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తుల మహత్త్వమును కావ్యపరిశీలనము వ్యక్తము చేయుచున్నది. కావ్యమునందు ఏ డాశ్వాసములు గలవు — I సంకల్పము, II శక్త్యుపాసన, III భాషోపాసన, IV రసోపాసన, V మన్మథోపాసన, VI కుమారీస్వయంవరము, VII కృతిసమర్పణము.

## I సంకల్పము

సౌందర్యమంజరీకృతికర్త శ్రీ కాళ్లకూరి గోపాలరావు గారాంధ్రసాహిత్యోపాసకులు, విద్వత్కవీంద్రులు. కావ్యము దేశీయ మైన ప్రాచీన మైన శ్రావ్య మైన మంజులానందకర మైన మంజరీచ్ఛందమునందు భావసౌందర్యరసస్థాయిలో రచియింపఁబడినది. రచనాసంకల్పచాతుర్యమును భాషాభావరసములు తెలుపుచున్నవి. తపోధనుఁ డైన కవిగోపుఁడు సకలపదార్థముల శృంగారభావరూపములను కావ్యకామధేనువును పోషించి నవనవకావ్యార్థనవనీతమును బడయుచున్నాఁడు. కవుల సంభావనాశక్తి కావ్యసృష్టికి కీలకము.

ధ్వనిగుణబద్ధ మైన యీ కావ్యము నవభావరసానందమును గలుగఁజేయుఁ చున్నది.

కవిగోపుఁడు ప్రసాదకామధేనువును
శృంగారలసదలంక్రియను గ్రహించి
యఖిలపదార్థంబు లను మేఁత మేపి
ధ్వనిగుణబద్ధగాఁ బాలించి పితికి,
రసపయోవృష్టి మానసభాండమందుఁ
దగు మాత్రము తపోగ్నితప్తం బొనర్చి
యింబారఁ బ్రకృతిదధిం బేరఁబెట్టి
భావమంథానమ్ముఁ బట్టి మథింప,
నవనవకావ్యార్థనవనీత మొదవి
యమృతతుల్యం బయి యలరారుచుండు! I, 29-38

* * * *

పరిభాష మాయ శాస్త్రరహస్యసృష్టి;
నా మాయ యను పటం బటు త్రోచివైచి,
కావ్యభావ, నఖండనవ్యతే మెఱయ,
విశ్వరూపంబుఁ జూపెడివాఁడె సుకవి! I, 49-52

చిరకాలాగతము లైన కావ్యసంప్రదాయసంకేతములు విశ్వసాహిత్యరచనకును సందర్శనమునకును రసానందమునకును ప్రతిబంధకము లైనవి. మాయాపరిభాషాసంప్రదాయములను త్రోచివైచి విశ్వకావ్యరసానందమును సౌమ్యరూపమునఁ గలుగఁజేయుట కావ్యప్రయోజనము. శక్తిపరిణామము లైన సృష్టిస్థితిలయముల పరిణామచిత్రము పరమకావ్యము. శక్తిసంజాత మైన సంయోగపాటవానందమునకు మన్మథరసానందము సామాన్యప్రమాణము. రసానందము, కాయయౌవనము వదలినకొలఁదిని, భావయౌవనమునందు ప్రబలుచున్నది. రసా

నందమునకు దేహాత్మ లన్యోన్యాశ్రయములు. రసానంద మొకచోట తగ్గిన, మఱొకచోట హెచ్చును. సౌందర్యమంజరి శృంగారరసానందమును రసోపాసకులకుఁ గలుగఁజేయఁగల విధమును కావ్యార్థము బోధించుచున్నది. రసానందమున కభినవసృష్టి మూలముగ నున్నది. ఆచారశృంఖలములు, ప్రపంచపరిణామమునం దితరరంగములలోవలె, కావ్యరంగమునందును ప్రతిబంధకములు. స్థితిరసవిలాసంబుల సంయోగము పరమార్థము. మహాకవు లీ పరమార్థమును బోధించుట కధికారులు.

సకలతంత్రస్వతంత్రకవులం గొల్చి
తచ్చక్రవర్తిత్వ మిచ్చ నూహించి,
సర్వతోముఖరసాస్వదచమత్కార
సవతఁ జూపు తదీయకవిత నర్థింతు. I, 57-60

* * * *

సృష్టిస్థితిలయంబు లెట్లు భిన్నములు ?
ఒకదాని పరిణామ మొకటి యూహింప !
ఈ పరిణామలీలాపరమాణు
పరిణామచిత్రంబె పరమకావ్యంబు ! IV, 149-152

* * * *

స్థితి విలాసంబు భారతి విలాసంబు
రసవిలాసంబు దర్పకవిలాసంబు
జోడింతు, నానందశోభ పెంపొంద;
నా రచియించు సౌందర్యమంజరికి
సర్వాంగసౌష్ఠవసంపదం గూర్చి,
యివి పరమార్థసంహిత లగుంగాత ! I, 69-74

సౌందర్యమంజరి యపూర్వ మైన భావకావ్యము. పింగళి సూరనార్యుఁడు కళాపూర్ణోదయమునందు భావానుభూతికిని రూపాను

భూతికిని గల సంయోగవియోగముల పరమార్థమును మనోహర మైన కావ్యరూపమున సృజించెను. ఆత్మసాక్షాత్కారసాధ్య మైన రసానందమునకు స్థానము హృదయము. హృదయమణిధారణము సకలార్థసాధనము. హృదయాధిష్ఠిత మైన సచ్ఛక్తి, సత్త్వము సత్యము సమత్వము సమరసము సంభవము మున్నగు నామరూపముల విశ్వపరిణామమును బొందుచు, రసానందమునకు సాధనం బగుచున్నది. ఈశ్వరుఁడు హృదయస్థుఁ డై సకలభూతములను రసయోగమార్గమున నడపుచున్నాఁడు. కావ్య మీ పరమార్థమును మనోహరముగ నాత్మగతము చేయుచున్నది.

ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున! తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా.

గీత 18, శ్లో. 61

సత్పదార్థము పరమాణువు మొదలు పరబ్రహ్మమువఱకును వ్యాప్త మైన బ్రహ్మాండమును ధర్మరససూత్రమున ధరించుచున్నది. విశ్వవిలాసములు సచ్ఛక్తి చిచ్ఛక్తి క్రియాశక్తి పరిణామములు; రసానంద సాధనములు.

కావ్యము విశ్వాధార మైన సర్వతోముఖరసానందసిద్ధి కాశ్రయము. సౌందర్యమంజరియం దీ పరమార్థమును కృతికర్త నవీనవిధానమున నిర్వహించిన విధమును కావ్యార్థము వివిధసందర్భములందును సువ్యక్తము చేయుచున్నది.

## II శక్త్యుపాసన

బ్రహ్మాండావృత మైన చైతన్యశక్తి పిండాండములందు తత్త్వానురూపముగ గోచరం బగుచున్నది. ప్రపంచభూతపంచీకరణమునందు చైతన్యశక్తి కారణసూక్ష్మస్థూలావస్థలలో ప్రపంచపరిణామ

మును బొందుచు పురుషార్థమునకు సాధనంబుగ నున్నది. సూక్ష్మకారణావరణములందు వ్యాప్తమైన శక్తిని స్థూలావరణములందు ప్రసరింపఁజేయుట విజ్ఞానము, యోగము. ఆకాశతత్త్వమునందు వ్యాపకముగ నున్న చైతన్యశక్తి పృథ్వీతత్త్వమునందు పరిమిత మగుచున్నది. అఖండమైన చైతన్యశక్తికి బ్రహ్మాండఖండబిందువు లన్నియు శక్తిబీజములు. చైతన్యశక్తి బాహ్యాభ్యంతరములం దేకశ్రుతిగతిరాగలయబద్ధమై ప్రకాశించుచున్నది. బాహ్యాభ్యంతరశక్తుల సంయోగము రసయోగము, పరమార్థము, పురుషార్థము. చైతన్యశక్తి ప్రభావమును వేదాంతము వైరాగ్యమునను, ఆగమములు యోగమునను, కావ్యములు రసమునను, శాస్త్రములు సిద్ధాంతమునను, కళలు క్రియారూపమునను సువ్యక్తము చేయుచున్నవి. యోగములయం దాగమశాస్త్రసిద్ధమైన కుండలినీయోగము శక్త్యుపాసనకు ప్రాచీనసంప్రదాయసిద్ధము. అఖండమైన విశ్వవ్యాప్తమైన చైతన్యశక్తి నాత్మయం దావాహనము చేసి, శక్తి నేకముఖముగ చేయుట కుండలినీయోగము. కుండలినీయోగము నామరూపవిలసితము లైన భిన్నశక్తులకు మహాశక్తిస్వరూపమును గల్పించి ఆనందరసమును గలుగఁజేయుచున్నది.

వరదాయిని యైన శక్తిని ప్రాచ్యు లాభ్యంతరసాధనలను పాశ్చాత్త్యులు బాహ్యసాధనములను నుపాసనఁ జేయుచు, సుఖదుఃఖములను వైరాగ్యభాగ్యములను సిద్ధియంత్రములను పుణ్యపాపములను సృష్టిసంహారములను ప్రపంచపరిణామార్థము పడయుచున్నారు.

చరాచరప్రపంచ మంతయు చైతన్యశక్తిమూలమున జీవయాత్ర చేయుచున్నది. జీవజాలములు శక్తిని స్వాధీనము చేసికొనుటకు చేయుచున్న ప్రయత్నములను ప్రపంచపరిణామము విశదము చేయుచున్నది. వర్తమానకాలమునందు ప్రకృతిశాస్త్రజ్ఞులు వ్యక్తము చేసిన సిద్ధాంతములును నిర్మాణములును కుండలినీశక్తియోగపరిణామము

లనే నిర్ణయించుచున్నవి. జీవశాస్త్రము భౌతికశాస్త్రము రసాయన శాస్త్రము జ్యోతిశ్శాస్త్రము గణితశాస్త్రము వేదాంతశాస్త్రము యంత్రశాస్త్రము శిల్పశాస్త్రము మొదలగు శాస్త్రములు చేసిన నిర్ధారణలు ప్రాచీనవైదికవిజ్ఞాననిర్ణయములను సమర్థించుచున్నవి. వర్తమాన భౌతికశాస్త్రసిద్ధాంతములు నిర్మాణవిమర్శనములు ప్రాచీనాధ్యాత్మిక సిద్ధాంతమార్గములను సమర్థింపఁగల విధమును పరిశోధనలు విశదము చేయుచున్నవి.

ఆదికాలమున భయభ్రాంతులకు మూలము లైన ప్రకృతి శక్తులు (ఆత్మశక్తి యంత్రశక్తి) కాలక్రమమున వశవర్తినులై మానవసర్వాభ్యుదయమునకు వినియోగపడుచున్నవి. ఆవిరిశక్తి విద్యుచ్ఛక్తి తేజశ్శక్తి రేడియోశక్తి ఓజశ్శక్తి బాహ్యయంత్రసాధనముల మానవ సౌఖ్యమునకు వినియోగపడఁగల విధమును పాశ్చాత్యవిజ్ఞానము విశదము చేయుచున్నది. భావయంత్రసాధనమున నీ పరమార్థమును ప్రాచ్యులు సాధించిన విధము, సౌందర్యమంజరిలోని శక్త్యుపాసనాశ్వాసము నందు మనోజ్ఞ మైన యోగశాస్త్రకళారసభరితభావములచే సంభావితము. ఆ శక్తి నుపాసించి ధ్యానించి తన చిత్తమున స్ఫురించిన రీతిని గోపాలరావు గారు సౌందర్యమంజరిని రచియింప సంకల్పించిరి. ఆ మహాసంకల్పము కావ్యరసానందమును గలుగఁజేయుటయందుఁ గల సాధ్యాసాధ్యములకు సౌందర్యమంజరి ప్రమాణము. వైరాగ్యభాగ్యములకును త్యాగభోగములకును భావకామ్యములకును గల సంరంభము నానందోపాసనయందు సమన్వయము చేయుటకు కవి పాడిన యానంద గీతము ప్రపంచవాసనల కనురూపముగ నున్నది.

అఖండ మైన శక్తి ఖండరూపములందు సూక్ష్మాతిసూక్ష్మరూపమునను, బాహ్యాభ్యంతరములందు సుశృంఖలబద్ధ మైనపుడు ప్రపంచస్థితికిని

రసానుభవమునకును, అపశ్రుతిబద్ధమగునపుడు దుఃఖానుభవమునకును విలయమునకును, సాధనభూతముగ నున్నది.

ప్రకృతిశక్తి యనెడి పాలసంద్రంబు
ప్రాచ్యులు పాశ్చాత్త్యు లచ్యుతద్రఢిమ
భావయంత్రంబులు బాహ్యయంత్రములు
నా నొప్పు కవ్వముల్ పూని మథింప,
వైరాగ్యభాగ్యరూపములు ధరించి
యుద్భవించిన లక్ష్మి! యుత్సాహజనని!
ఒక్క మా జేటు చూడు, మొక్కి వేడెదను;
వైరాగ్య, మదియును భాగ్యంబె యైన,
భాగ్యసంగతినె సంభావ్య మై యొప్పు;
ఉభయభాగ్యంబుల విభవంబు నిమ్ము!

*     *     *     *

తైజసశక్తి! నాదబ్రహ్మమూర్తి!
ప్రకృతిస్వరూపిణీ! ప్రత్యక్షశక్తి!
అత్యంతభక్తిమై ధ్యానింతు నిన్ను;
చల్లఁగా మెల్లఁగా, నుల్లాస మొలయ
దయ మీఱ, నాదు చిత్తమున స్ఫురించి
పరమార్థశబ్దప్రభలు గూర్పు మమ్మ!
సౌందర్యమంజరీసౌమ్యరూపమున,
నా కాంచిన తెఱంగు నను( జూపనిమ్ము! II, 81-98

శక్త్యుపాసన యోగసిద్ధికిని యంత్రరచనలకును వలె కావ్యరచనలకును సాధన మైన విధమును, నాదోపాసనసాధ్య మైన సకలవిజ్ఞానములకును మూల మైన భాషోపాసన పరిస్ఫుటము చేయుచున్నది.

## III భాషోపాసన

అవ్యక్త మైన శక్తికి నాదము ప్రథమవ్యక్తస్వరూపము. నాదము శబ్దరూపమున బ్రహ్మాండావృతి మై భాషాధారమున బ్రహ్మాండమును గ్రాహ్యము చేయుచున్నది. శబ్దము భావదశయందు ౧ పరారూపమును, భావము సూక్ష్మదశయందు ౨ పశ్యంతీరూపమును, భావము శబ్దరూపమున ౩ మధ్యమారూపమును, వాగ్రూపమున ౪ వైఖరీరూపమును దాల్చుచున్నది. భావము ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తుల సంయోగవియోగములచే ప్రపంచపరిణామమును పొందుచున్నది. సకలశబ్దార్థములకును అక్షరామ్నాయము స్థూలరూపమున మూలాధారము. వేదములు వేదాంగములు కావ్యములు కళలు మంత్రములు యంత్రములు భావశబ్దార్థపరిణామ మైన పురుషార్థమునకు సాధనములు.

పరా వాఙ్మూలచక్రస్థా పశ్యంతీ నాభిసంస్థితా
హృదిస్థా మధ్యమా జ్ఞేయా వైఖరీ కంఠదేశగా.

చైతన్యశక్తి బ్రహ్మాండాంతర్గత మైన పిండాండమునకు ఆవాహన కాఁగల విధమును కుండలినీయోగము విశదము చేయుచున్నది. చైతన్యశక్తి హంసరూపమున ఉచ్ఛ్వాసనిశ్వాసములను గలుగఁజేయుచు, పిండాండములందు శివశక్తుల సంయోగమును గలుగఁజేయుచున్నది. బ్రహ్మాండమునందు మాయాశక్తిని వలె, పిండాండమునందు మనశ్శక్తిని స్వాధీనము చేయఁగల విధము కుండలినీయోగము. బ్రహ్మాండమునందు నాదబిందుకళాపరిణామము లైన వర్ణమాలాక్షరములు దేహమునందును వర్ణమాలాక్షరశక్తుల రూపమున నంతర్భూతము లై యున్నవి. బ్రహ్మాండాంతర్గతము లైన భూలోకము భువర్లోకము సువర్లోకము మహర్లోకము జనలోకము తపోలోకము సత్యలోకము పర మైన శక్తులు, పిండాండ మైన దేహమునందును అక్షర

రూపమున నంతర్గతము లై, సప్తకమలరూపమున ప్రతిష్ఠితము లై యున్నవి. హిరణ్యగర్భ శక్తి విద్యుత్కిరణమయ మైన సూర్యరూపమున లోకవికాసమును జేయుచున్నది. రేడియోశక్తి యంత్రముఖమున పరిస్ఫుట మగు విధమున, చైతన్యశక్తి కుండలినీప్రబోధమున పరిస్ఫుట మగు విధమును కుండలినీయోగము బోధించుచున్నది. గళయంత్రవర్ణన యీ పరమార్థమును మనోహరముగ మనోగతము చేయుచున్నది.

అవ్యక్తశక్తి సువ్యక్తస్వరనాదరూపమునను అక్షరామ్నాయము నను గ్రాహ్య మగుచున్నది. అకారము మొదలు హకారమువఱకును గల యక్షరములు శబ్దములను పదములను ప్రత్యయములను పదార్థములను సమకూర్చుచున్నవి. "అహమ్" పదార్థము "అహంకారము"గ వ్యక్త మై జగద్రూపముగ పరిణమించుచున్నది.

భాషల స్వరూపస్వభావములు ప్రజల స్వరూపస్వభావములకు ప్రమాణములు. ఆంధ్రాక్షరామ్నాయము భాషాస్వరూపస్వభావములు సంగీత సాహిత్య శాస్త్ర కళాది నిర్మాణములందు చైతన్యశక్తిని ప్రజ్వలింపఁజేయఁ జాలియున్నవి. భాషోపాసకులు కావ్యములందు భాషాశక్తి నుపాసించి కృతార్థులు కాఁగల విధమును భాషోపాసనాభ్యాసము విశదము చేయుచున్నది. చైతన్యశక్తి భాషాశక్తిసాధనమున సకలార్థసిద్ధికిని సాధనంబుగ నున్నది. మాటలు నుడిమంత్రము లగుచున్నవి. ఆ మహాశక్తి దేహక్షేత్రమునందు ముకుళితము లైన సప్తకమలములను వికసింపఁజేసి చిదంబరక్షేత్రమునందు దివ్యకాంతుల నానందతాండవము నానందగానమును జేయుచు, నాత్మానందమును గలుగఁజేయుచున్నది. వికసించిన కుండలినీశక్తి విశ్వగీతమును పాడుచు, విశ్వరూపమును సందర్శించుచు, విశ్వతాండవమును జేయుచు, విశ్వరసానందమును ప్రత్యక్షము చేయుచున్నది.

గళయంత్రోపమానమున శబ్దశక్తిస్వరూపస్వభావము లీ క్రింది పాదములందు సుబోధములు. విశ్వశక్తి శబ్దకాంతుల భావరూపములను దాల్చుచు భాషామహాశక్తియోగమునందు రసవిలాసానందమును గలుగఁజేయుచున్నది. వరములు శాపములు భాషాశక్తిపరిణామములు. పరమార్థగ్రహణమునకును పరమార్థసాధనమునకును భాషామహాశక్తి మూలాధారము. ఆశక్తి సహస్రారమునందు భాసిల్లుచు భాషాస్వరూపమున సకలాంతరములందును ప్రక్షిప్తముగ నున్న విధమును గళయంత్రోపమానము (త్రోకుడు హార్మోనియము) వ్యక్తము చేయుచున్నది. భాషావికాసము సంగీతసాహిత్యవికాసములకును మానవాభ్యుదయమునకును బీజము.

అఖిలార్థదాయిని యగు కల్పవల్లి
భాషామతల్లి యే ప్రతిజాతి తల్లి ;
ప్రజలకు నేకోదరప్రీతిఁ గూర్చి,
జాతికుటుంబముల్ సవరించుచుండు !

* * * *

జ్ఞానతీర్థంబులన్ జలకంబు లార్చి,
సంగీతసాహితీస్తన్యం బొసంగి,
నాకంబు భూలోక మేకం బొనర్చు
కల్పవల్లీడోలికలఁ బండఁబెట్టి,
భావహస్తములతోఁ బైపయి కూఁచి,
పరమార్థములు జోలపాటలు పాడి,
ప్రకృతివినోదముల్ పరికింపఁజేసి,
ముద్దుబిడ్డలఁ బెంచి మురియుచునుండు.
భాష పెంపకయున్నఁ, బసులము గామె ?
భాష పెంపే మానవప్రాభవంబు ! III, 1-14

* * * *

మేదోంబురుహపీఠ! మేధాస్వరూప!
వాయుచాలనమృదుపాదోపహతుల
లలి శ్వాసకోశభస్త్రల నొత్తికొనుచు,
భావహస్తంబులు పైపైకిఁ జాఁచి
వక్త్రావయవవర్ణఫలకముల్ మీటి,
నీవు శ్రుతుల్ దీర్చి నియతి వాయించు
గళయంత్ర మఖిలమంగళకరం బంబ!
వేదవేదాంగముల్ వేదాంతములును
సాహితీగ్రంథముల్ సంభాషణములు
నీ గానమహిమముల్; నిత్యంబు నీవు
లోకయాత్ర సమస్త మేకగీతముగ
పాడుచుందువు తల్లి! స్వరకల్పవల్లి! III, 35-46

ఆ శక్తిప్రభావము వేఱొక విధమున వీణోపమానమున వ్యక్తము చేయఁబడినది. దేహాధార మైన బ్రహ్మదండి వీణాదండము. వీణాదండము భిన్నస్థానములందు సప్తస్వరములను కల్పించుచున్నది. బ్రహ్మదండ శక్తి మూలాధార స్వాధిష్ఠాన మణిపూరక అనాహత విశుద్ధ ఆజ్ఞా సహస్రార చక్రస్థానములందు శక్తిరూప మైన స్వరశక్తుల నుత్పత్తి చేయుచున్నది. కపాలకచ్ఛపీవీణ సరస్వతీశక్తిని ప్రజ్వలింపఁజేయు చున్నది. బ్రహ్మాండవీణారూప మైన బ్రహ్మదండవీణ సహస్రారమున నుండి మూలాధారస్థానమువఱకును వ్యాప్తము లైన శక్తిస్థానములందు శక్తుల నాడించుచు రసానందమును గలుగఁజేయుచున్నది. భాస్వరస్వర వీణ దివ్యనాదమును ఆజ్ఞావీణ ఆజ్ఞాశక్తిని ఇతరనాదస్థానము లితర శక్తులను ప్రసాదించుచున్నవి. ఆ శక్తి ప్రత్యక్ష మై విశ్వకావ్యరచనకు వినియోగపడుటకై గోపాలరావుగారు చేసిన యుపాసనావిధానము గంభీరముగ నున్నది.

బ్రహ్మానందపు వీణ, బ్రహ్మాండవీణ,
కమ్రవీణ, కపాలకచ్ఛపీవీణ,
దేవత్రయాత్మక త్రిగ్రంథివీణ,
నాడులే తంత్రులై నటియించు వీణ,
అఖిలశక్తులకు మూలాధార మైన
గణపతిపూజతోఁ దొరఁగెడి వీణ,
త్రిజగజ్జనకము స్వాధిష్ఠాన మైన
యోగాగ్నికుండమం దుదయించు వీణ,
మణిపూర తేజంబు మహిమంబు నెఱపఁ
గనులకు మిఱుమిట్లు గలిగించు వీణ,
అద్భుతరీతి ననాహతస్థితినె
ప్రణవశబ్దంబులం బలికించు వీణ,
కల రూపుల విశుద్ధకలకంఠగతుల
వాఁగెడి భాస్వరస్వరపూరవీణ,
మానసహంసంబు లీన మా లీల
నాజ్ఞానువర్తి యై యలరారు వీణ,
బ్రహ్మరంధ్రము సహస్రారంబు దాఁకి
యమృతంబు వర్షించి యలరించు వీణ,
సూక్ష్మాతిసూక్ష్మ తేజోరేఖఁ బోని
కుండలి నాడించు గుప్తార్థవీణ,
అమ్మ! మా యమ్మ! నా కిమ్మ నీ వీణ;
దానిఁ బల్కించెడి తలఁపు జనించె! III, 47-68

అవ్యక్త మైన సచ్ఛక్తి చైతన్యప్రపంచభావరూపముల వ్యక్తమగుచున్నది. చైతన్యశక్తి సంభావనయందు చిత్తప్రవృత్తి కనురూపముగ శబ్దశక్తి పరిణామమును పొందుచున్నది. శబ్దశక్తి వాగర్థాధారమున భాషాపరిణామమును పొందుచు, పురుషార్థమునకును రసానందమునకును

సాధనమగుచున్నది. శక్తిస్వరూపములును భావార్థములును నిష్క్రియాక్రియలును సాంఖ్యయోగములును నీవునేనులును నేకమౌట మహాయోగానందము. రసోపాసనయందు ప్రవృత్తిపరమైన యోగానందము సాధ్యము. హృద్యకావ్యములు హృదయాహ్లాదకరమైన రసోపాసనకు సాధనములు.

నీవె నేనును నేనె నీవు నయ్యెడము, -
ఈను సముచ్చయమదే యోగకారకము;
అదియు నుభయమధ్యమందు లయింప,
నీవు నే నేక మౌ భావంబె మనము!
ఆ యైక్యమందె తా నావిర్భవించు
సృష్టికిం బ్రతిసృష్టి హృద్యకావ్యంబు!

* * * *

భక్తిమైఁ బ్రణమిల్లి ప్రార్థించువాఁడ,
బాల్యంబునుండి నీ భక్తుండ నంబ!
దయ మీఱ నాయం దుదయ మందవమ్మ,
సౌందర్యమంజరీసౌమ్యరూపమున! III, 79-88

సకలపదార్థములందును పూర్ణచైతన్య మేకముఖమున వ్యాపకమై యున్నను, భూతపంచీకరణమునందు స్థూలస్వరూపముల నాకాశతత్త్వము క్షీణించుటయు పృథ్వీతత్త్వము ప్రబలుటయు సంభవించుచున్నది. పంచభూతములును ననులోమవిలోమమార్గమున ప్రపంచీకరణమును బడయుచున్న విధమును భూతముల యుత్పత్తిస్థితిలయములును పంచీకరణమార్గమును తెలుపుచున్నవి. సృష్టిపరిణామమునం దాకాశపరమాణువు పృథ్వీపరమాణువుగ పరిణమించుచు, క్షేత్రజ్ఞున కనంతములైన క్షేత్రములు కల్పింపఁబడుచున్నవి. ఆకాశపరమాణువునందు పరిపూర్ణముగ వ్యాప్తమై యున్న చైతన్యశక్తి

పృథ్వీపరమాణువునందు విక్షేపావరణములలో స్తంభించి ప్రక్షిప్త మగుచున్నది. పృథ్వీజలతేజోవాయుతత్త్వములం దంతర్గతమై యున్న చైతన్యశక్తిని ప్రజ్వలింపఁజేసి పరమార్థమును బడయుటయే ఇతర యోగములకువలె కుండలినీయోగమునకును పరమార్థము. శ్రీశంకరాచార్యులు సౌందర్యలహరియం దుపాసించిన త్రిపురసుందరిని శ్రీగోపాలరావుగారు సౌందర్యమంజరియందు ప్రాచ్యపాశ్చాత్త్యసంస్కారరసోపాసనరూపమున నుపాసించి కృతార్థు లయిరి.

## IV రసోపాసన

కవి భాషామహాశక్తి తనయం దుదయించి నటియించుటకు చేసిన యుపాసన కనురూపముగ, భాషాశక్తి యుపాసకుల కుపాసనానురూప మైన కావ్యరసానందమును గలుగఁజేయుచున్నది. రసోపాసనాభ్యాసము విశ్వాత్మక మైన రసస్వభావస్వరూపనిర్ణయములను జేయుచున్నది. కావ్యములందు నవరసములు నుపాస్యము లైనను, శృంగారవీరశాంతరసములు మాత్రమే ఉపాసనానురూపముగ ప్రయోగయోగ్యములు; సచ్చిదానందప్రాప్తికి సాధనములు. ప్రత్యేకభావశూన్యము లైన బీభత్సకరుణభయానకహాస్యాద్భుతరసములు రససిద్ధికి నిరర్థకములు. రసత్రయమునందు కావ్యముల శాంతరసప్రదర్శన మసంగతము. శాంతరసము నిద్రాలయావస్థలందు గోచరం బగుచున్నది; జాగరణావస్థయం దనుభవయోగ్యము గాదు; బ్రహ్మోపాసనకు లక్షణమైనను, ప్రవృత్తియందు దురారాధ్యము. ప్రవృత్తియందు, కావ్యములలో ప్రేమబీజ మైన శృంగారరసము సమాశ్రయము.

నిద్రలో శాంతంబు నెగడు; నయ్యాదియె
అవ్యక్తసౌఖ్యస్పృహానందకరము!
కర్త లయించుటం గర్మంబు సున్న;
శాంతరసము ప్రదర్శనయోగ్య మగునె? IV, 17-20

* * * *

శృంగారవీరంబులం గల్గునట్టి
మరణంబులం గాని స్ఫురణకు రాని
శాంతరససంపుఁ బ్రస్తావం బ దేల ?
అది ప్రవృత్తిని దుర్లభార్థంబు గాదె?
లయసృష్టిమధ్యంబులం బ్రవర్తిల్లి,
బ్రహ్మసోపాన మై పరఁగెడి నేమొ?

* * * *

స్థాయి జుగుప్సగాఁ దనరు బీభత్స;
మది యొక రస మాసె? యానంద మిడునె?

IV, 29-36

కావ్యములకు ప్రధాన మైన రెండవ రసము వీరరసము. రణవీరము రౌద్రము; రక్తపాతాసక్తము; క్రోధజనకము; భయదము.

ప్రేమైకబీజంబు శృంగారరసము,
క్రోధైకబీజం బగున్ వీరరసము!

* * * *

క్రౌర్యంబు హింస శోకంబు జుగుప్స
భయద మా వీరంబు పాలింటఁ గల్గు;
సంపాదనమునకు సంరక్షణమున
కాధార మగుటచే నారాధ్య మైన,
గుణవిశేషములతోఁ గూడినం గాని,
వీరంబు సంతోష మే రీతిఁ గూర్చు?
ఉక్తియుద్ధంబులు రక్తి గొల్పినను,
రక్తపాతంబు లాసక్తి గొల్పెడినె?
ధర్మశాంతులను సంస్థాపించు టనిన,
ఈ వీరము నణంచుటే యర్థ మగును
గణుతింపఁగ ననాదికాలంబునుండి

వీరంబు వణఁచుచే విశ్వోద్యమంబు;
వీరంబునం గాని వీరం బణంగ
దనుచు వీరంబునే యర్చించు జగము.
ఇది యొన్నఁ డెఱఁగునో యెఱుఁగంగరాదు,
ఇందన్న వణఁగని దిఁక వణంగెడినె? IV, 85-102.

శృంగారరసము సృష్టిస్థితుల కాధారము, ప్రేమమూలము, హృదయావిర్భూతము, విశ్వాత్మకము, ఆనందకరము, కావ్యసాధనము, రసరాజము. విషయాసక్తమైన శృంగారము భయంకరమైన హింసాశోకాదులను గలుగఁజేయుచున్నది. విషయారాధ్యములైన భాగ్యభోగములు పరిమితములు. త్యాగాసక్తమైన శృంగారము ప్రేమైకబీజమై నిత్యమైన ఆత్మానందమును గలుగఁజేయుచున్నది. శాశ్వతానందమునకు స్త్రీపురుషైక్యోపమాన మనతిక్రమణీయమైన సాహిత్యసంస్కారఫలము. శ్రీకృష్ణుని శృంగారలీలలందువలె, శంకరుని ప్రళయతాండవమునందును బ్రహ్మానందము గలుగుచున్నది. కురుక్షేత్రరణరంగమునందు విజయునివలె గోపాలరావు గారును సౌమ్యరూపమును జూడఁగోరుట సంస్కారఫలము, ప్రకృతిధర్మము.

శృంగారవిభూతులు భావజములు. సాత్త్వికశృంగారము భక్తిప్రేమపరిణామము, ఆధ్యాత్మికము. రాజసతామసశృంగారము కామమోహపరిణామము, ఆధిభౌతికము. సృష్టిస్థితిలయావస్థల కాధారములైన రసములును సాపేక్షములు. ప్రకృతియందు రసానందమునకు జ్ఞానేంద్రియ కర్మేంద్రియములును మనోబుద్ధిచిత్తాహంకారములును సాధనములు. ఇంద్రియములును ఇంద్రియశక్తులును మనోబుద్ధిచిత్తాహంకారసంస్కారములును పరిమితములు. ఇంద్రియారాధ్యమైన రసానందమును పరిమితము, సాంతము, సమ్మోహజనకము. అంతఃకరణసంజాతమైన రసానందము, రాగద్వేషయుక్తమై విషయాసక్తమై శ్రోత్రత్వ

క్చక్షుర్జిహ్వాఘ్రాణేంద్రియసంజాతమైన శబ్దస్పర్శరూపరసగంధాత్మకమైన పరిమితరసానందమును, రాగద్వేషవియుక్తమై ఆత్మాసక్తమై నిరతిశయరసానందమును గలుగఁజేయుచున్నది.

ఏ విధిం జూచినన్, శృంగారరసమె
రసరాజ మనఁజాలి రంజించు హృదిని;
శుచియు నుజ్జ్వలము నై స్తుతిపాత్ర మగును;
అది యొక్కటియె రసం బన్పించుఁ దుదకు!
స్త్రీపురుషైక్యంబు జీవేశ్వరైక్య
తుల్య మై యానందదుగ్ధాబ్ధిఁ దేల్చు;
తాత్కాలికానందఘనతవలన
శాశ్వతానందసాక్షాత్కార మొసఁగు! IV, 103-110

* * * *

రసమె యానందంబు, రసమె బ్రహ్మంబు;
అఖిలరసంబులు నానందగతులు!
విశ్వలిపిలిఖితవిశ్వకావ్యమున
నానందరసముల కైక్య మ్మెసంగు!
తద్భావనానందఘనత యొకటె
సృష్టిస్థితులకు విశిష్టఫలంబు!
అభినవసృష్టి మహానందకరము;
దానికిం దా విచ్చు ధర్మంబె లయము! IV, 141-148

* * * *

రసమహాశక్తి! మానసగతరక్తి!
ప్రార్థించువాఁడ! నాయం దుదయించి,
సౌందర్యమంజరీసౌమ్యరూపమున
నటియింపఁగదవమ్మ, ననుఁ జూడనిమ్మ! IV, 163-166

విశ్వపరిణామమునందు పరిణామసాధనము లైన సృష్టిస్థితిలయములు సాపేక్షములు. సృష్టియందు లయము, లయమునందు సృష్టి, సృష్టిలయములందు స్థితియు ప్రకృతిపరిణామసిద్ధములు. అనంతము లైన ప్రకృతిస్వభావస్వరూపములందు రసయోగములు రసానందమును గలుగఁజేయుచున్నవి. రసము లన్యోన్యాశ్రయము లై ఆనందసిద్ధికి సాధనము లైనను, సౌమ్య మైన ప్రేమగీతము సౌందర్యసంకీర్తనోపాసనలకు సరసముగ నున్నది. సౌందర్యమంజరి సౌమ్యసుందర మైన ప్రేమగీతమును పాడుచున్నది.

మోహనరాగరసానందమును మోహినీరూపసౌందర్య రసానందమును పరిమితములు, సాంతములు. శృంగారరసము కామపర మై విషయానందమును, త్యాగపర మై ఆత్మానందమును గలుగఁజేయుచున్నది. బాలకృష్ణుఁడు మోహనకృష్ణుఁడు శృంగారకృష్ణుఁడు మురళీకృష్ణుఁడు గోపాలకృష్ణుఁడు రాధాకృష్ణుఁడు గోపికాకృష్ణుఁడు వీరకృష్ణుఁడు ధర్మకృష్ణుఁడు మాయాకృష్ణుఁడు భక్తకృష్ణుఁడు భాగవతకృష్ణుఁడు శ్రీకృష్ణదివ్యవిభూతులు. రసానందమునకు స్థాయిభావము కీలకము. వీరశాంతసంస్కారాభావ మైన శృంగారమును ప్రవృత్తియం దసాధ్యము. వీరము లేని శృంగారము జడప్రాయము. శాంతము లేని శృంగారము కామపరాయణము. శ్రీరామకృష్ణుల వీరశృంగారము గంభీరము. ప్రహ్లాద ధర్మరాజ బలిచక్రవర్తుల శాంతశృంగారము రసానందపరాయణము. విషయాసక్త మైన తాత్కాలికానందము ఆనందమునకు లక్షణ మైనను, శాశ్వతానందమునకు ప్రతిబంధక మగుచున్నది. వీరశాంతరసానందమువలె శృంగారరసానందమును సాపేక్షము. శృంగారరసోపాసనకు ప్రకృతిసిద్ధ మైన మన్మథోపాసన సాపేక్షసాధనము. సాపేక్షసాధనములు నిరపేక్షరసానందమునకు సాధనములు గావు. నిరపేక్షరసానంద మాత్మానందపర మైన " ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః " తత్త్వ

శ్రయము. తత్త్వాశ్రయ మైన రసోపాసన ద్వంద్వాతీతము. పురుష
ప్రకృతియోగమాయాతీత మైన సౌందర్యవిలాసము లభేద్యము లై
యేకస్థాయియందు నిరపేక్షరసానందానుభవయోగమునకు సాధన
ములు. "ఏక మే వాఽద్వితీయం బ్రహ్మ" ఉపాసనయు, మహాశక్త్యు
పాసనయు రసానందమునకు సమానసాధనములు. మన్మథోపాసనా
భ్యాస మీ ప్రకృతిపర మైన రసాపేక్షాసాధనమును సంభావించు
చున్నది.

## V మన్మథోపాసన

శక్త్యుపాసన జ్ఞానశక్తిరూపమున భాషోపాసనను రసో
పాసనను, క్రియాశక్తిరూపమున మన్మథోపాసనను జేయుచు, కుమారీ
స్వయంవరమునకై సౌందర్యమంజరీకావ్యము సార్థక మగుచున్నది.
చతుర్విధపురుషార్థములందును అర్థకామములు ప్రకృతివిలసితవిభవ
ములు. ప్రకృతిసంపదలు కావ్యాంగము లై కావ్యప్రకాశమునకు విని
యోగపడుచున్నవి. యోగశాస్త్రమునందు ధర్మమోక్షములకు ప్రతి
బంధక మైన కామము, కామశాస్త్రపర మైన కావ్యమందు పురుషార్థ
మునకు సాధన మగుచున్నది. శృంగారరసము కామారాధనకామసంత
ర్పణలందు కావ్యపరిణామమును పొందుచున్నది. భావజుఁ డైన కామ
దేవుఁడు, కావ్యములందు విభ్రమరూపవిలాసభావసౌందర్యానుభవ
మున నంతర్ధాన మగుచున్నాఁడు. విశ్వయాత్రయం దనంతము లైన
శృంగారతరంగములు రూపభావసౌందర్యయోగబద్ధము లై పురుషార్థ
మునకు వినియోగపడుచున్నవి. పూర్వాంశమున పూజ్య మైన కామ
ముత్తరాంశమున దశావస్థలను గల్పించుచున్నది. నిరపేక్షశృంగారా
రాధనమునకు శాంత మాశ్రయ మైనను, సాపేక్షశృంగారవిభూతులు
కావ్యాలంకారమునకు సాధనము లగుచున్నవి. ఈ క్రిందిపాదముల
లోని గుణోపమానమును సంఖ్యాశాస్త్రసిద్ధాంతమును మన్మథప్రవృ
త్తిని మనోహరముగ తెలుపుచున్నవి.

కర్మగుణాధీనకాయధర్మమున
జ్ఞానాంబకప్రయోగానూనమహిమ
సంచితంబుగఁ జూపు పంచబాణుఁడవు,
ఇంద్రియరూప! యతీంద్రియాటోప! V, 91-94

* * * *

ఆద్యంతరహితనిరంతరప్రకృతి
చందంబు కామంబు బిందురూపంబు!
ఆత్మసంకలనంబు వ్యవకలనంబు
గుణకంబు భాగహరణము — నిం దెదియు
బిందుతత్త్వంబును భేదింపలేదు!
పూర్వాంశమం దిది పూజ్యమై తోఁచు,
నుత్తరాంశమున సద్యోదశకముల
సృజియించు; నిది సాంఖ్యసిద్ధమతంబు! V, 41-48

* * * *

ఈరేడు జగములం దే రీతిఁ గనిన,
నీ ధాటి కెదు రొడ్డి నిలువలే రెవరు;
పరిమితిభేదంబు పరఁగెడింగాక,
నీ విజయం బదే నిక్కంబు తుదకు! V, 175-178

* * * *

శృంగారమదనుండె చింతింప బ్రహ్మ;
వీరమన్మథుఁడె యా విష్ణుదేవుండు;
శాంతకాముఁడె మహేశ్వరుఁడు యోజింప;
ఆ త్రిమూర్తుల మూర్తి యతనుండు నిజము!

* * * *

కేవలశృంగారభావజుం డైన
మన్మథు సేవయే మధుర మా సేవ!

అరయ భక్తికిని బ్రహ్మానందమునకు
స్వరతంత్రజాతముల్ నిరుపమోపములు ;
ఉపమేయముల మించు నుపమానములుగ
పాడకట్టు నొక్కొక్క కప్పను తలపోయ ! V, 81-90

* * * *

ఇంద్రియానందంబు నెసకొల్పికొనుచు
నున్నంతనే పూరకుండువే కాని,
తరుణంబు చిక్కిన దర్పించి మించి
భావంబుననె మహాబలుఁడ వయ్యెదవు ;
స్వాంతంబుననె ప్రభంజనుఁడ వయ్యెదవు ;
శరపరంపరల నూపిరి సల్పనీక
వడి వడి వర్షించి సడి సద్దు లేక,
యల్లకల్లోల మాన ట్లొనర్చెదవు ! V, 161-168

* * * *

ఎంత పోకిరివయ్య ? యింతలో జనుల
నున్మత్తులం జేసి, యుల్లసిల్లెదవు !
ఏకత్వమందే యనేకత్వ ములయు,
ఆ యనేకత్వమం దైక్యంబు గనుటె
పరమార్థమార్గంబు ; ప్రాచ్యపాశ్చాత్య
సుగుణమేళన మెన్న జగదుత్సవంబు !
భావమేళన మెన్నఁ బరమోత్సవంబు !
మేళనమందె సమ్మిళిత ముత్సవము ! V, 209-216

* * * *

నీ ప్రభావాణువు నెపముగా నిపుడు
సౌందర్యమంజరీసరసాభిధాన
శృంగారకృతిని సృజించినవాఁడ;
అనుకంప నా కృతియుం దావహించి
స్థిరముగాఁ, గాంచుము దిగ్విజయంబు! V, 228-232

## VI కుమారీస్వయంవరము

గోపాలరావు గారు బాల్యమునుండియు కావ్యరసోపాసకులు; చిరకాలసాధనఫలముగ 'సౌందర్యమంజరీ' సరసాభిధాన శృంగార కావ్యకన్యకను బడసిరి. ఆ కావ్యకన్యక 'అక్షరరూపచిత్రాంచిత యైనను, కేవలానంగయు భావసంజాతయు'.

నిత్యసౌభాగ్యయు నిత్యయౌవనయు
నిత్యప్రసన్నయు నిత్యానుభోగ్య;
రాజ్యనాయికవోలె, రమణి యికావ్య
నాయిక యానందదాయిక!... VI, 77-80

ఆఱవ యాశ్వాసమునందు సౌందర్యమంజరీకుమారీస్వయంవర మున కనుకూల మైన వరాన్వేషణము, రాయబారములు, సామాన్య సంసారులకు వరాన్వేషణమునందుఁ గల సంశయవిశ్వాసములు, కష్ట నిష్ఠురములు సరసముగ వర్ణింపఁబడినవి. సరసభావవిలాసచతుర కావ్యకళావతి సకలకళావికాసక్రియాధుర్యుని భావయౌవనపాటవ విలాసుని సరసుని చతురుని విక్రమదేవుని వరించి భావానుకూల దాంపత్యమును బడసినది.

## VII కృతిసమర్పణము

సప్తమాశ్వాసము కృతిసమర్పణముతో ముగిసినది. కృతిపతి యైన వరుఁడు స్వయంవరమునందు వరణీయయైన కావ్యకన్యను వరించి

కృతార్థుఁ జెయ్యోను. శ్రీ విక్రమదేవవర్మ గారి సాహిత్యోపాసనానురక్తి ప్రఖ్యాతవిషయము.

శ్రీమన్మహారాజ! శ్రితకల్పభూజ!
ప్రథితసద్ధర్మ! విక్రమదేవవర్మ!
రాజ్యకావ్యయశోనురక్తనాయికలు
ఫుల్లాబ్జముఖులు శ్రీభూనీళలట్లు
వామాంకమందు పార్శ్వములందుఁ జేరి
దీవన లను సుమనోవృష్టి నడుమ,
చిఱునవ్వుమోములు సిగ్గుమై వాంచి,
శోభావిశేషధారాభరస్ఫూర్తి
నభిషేక మొనరింప — నాత్మాంశభవుని
సింహాసనప్రతిష్ఠితుని నిన్ జూచి,
తనుఁ జూచుకొనునట్లు తనిసి యుప్పొంగు
శ్రీమహావిష్ణు వాశ్రితకల్పశాఖి
యాయురారోగ్యంబు లైశ్వర్య మెల్ల
సమధికంబుగ నీకు సమకూర్చుఁగాత! VII, 1-14

*    *    *    *

రాజ్యంబు రుక్మిణి, రాధ యశంబు;
ఈ కావ్యకన్యకయే సత్యభామ!
మన్మనశ్శక్తి స్యమంతకమణిని
భామావిలాసైకపరమరత్నమును,
నిరుపమానం బగు గురుభక్తి మెఱయఁ,
గానుకగా నీ కీయఁగలిగితి; నింక
నీ కృష్ణలీలలు నిత్యహర్షముగఁ
గల్పపుష్పంబులం గైసేయుమయ్య! VII, 19-26

*    *    *    *

రాజ్యలక్ష్మి యమేయరాగంబు వెలయఁ
దఱవిన కీర్తిచందనచర్చ లొలయఁ,
బరిమళించెడి శివంకరకరాబ్జమునఁ
గర మనుగ్రహ ముంచి గ్రహియింపుమయ్య,
వైభవోద్యద్ద్విజయాభివాదకము
సహృదయాశీర్వాదసారపూరకము
సౌందర్యమంజరీసరసనామకము
పట్టాభిషేకాంకపారితోషికము! VII, 41-48

* * * *

నవనవార్థంబులన్ నవరసామోద
నటన చూపెడి సుమనః ప్రపంచమున,
అభినవకృష్ణరాయఖ్యాతి గనుము;
ఆంధ్రభోజుఁ డనంగ నభినుతిం గొనుము! VII, 37-40

## ఉపసంహారము

సౌందర్యమంజరి గంభీర మైన భావకావ్యము. విశ్వకళా సౌందర్యవిలాసము లనంతములు, వాచామగోచరములు, దురారాధ్యములు. ఉపాసకులు సంకల్పసంస్కారానురూప మైన ఫలమును బడయుదురు. పాశ్చాత్త్యులు రూపసౌందర్యమును బాహ్యనియమముల నుపాసించుచు బాహ్యదాంపత్యఫలము ననుభవింతురు. ప్రాచ్యులు భావసౌందర్యము నాభ్యంతరనియమముల నుపాసించుచు భావదాంపత్యఫలము ననుభవింతురు. ప్రాచ్యసంస్కారము వైరాగ్యమును పాశ్చాత్త్యసంస్కారము రాగభోగములను సమకూర్చినవి. ఉభయసంస్కారము లందును సౌందర్యసంయోగము కావ్యప్రయోజనము.

సృష్టికిం దల్లి ప్రాచీమహాదేవి,
స్థితికుమారి విలాసగతియె ప్రతీచి;
ఉభయకల్యాణగుణోపేత గాన,
నా కృతిసుత లయానందస్వరూప! VI, 1-4

సౌందర్యమంజరి విశ్వసౌందర్యధ్వనిగుణబద్ధ మైన కావ్యము. సౌందర్యమంజరిలో పాదపాదమునందును ధ్వనియుక్త మైన భావ భాషారసయోగానందము ప్రతిధ్వనించుచున్నది. గోపాలరావు గారు ప్రాచ్యపాశ్చాత్త్యసంస్కారమును రూపభావదాంపత్యమును దేహాత్మ కల్యాణమును బాహ్యభావయంత్రయోగమును శక్తిపరమేశ్వరసంయోగమును ప్రకృతిపురుషవిలాసమును శృంగారానందయోగరూప మైన సౌందర్యమంజరీకావ్యమునందు సార్థకము చేయుటకు చేసిన సంకల్పోపాసనములు సరసములు. కావ్యరచనయందు వేదాంతమంత్ర యోగశాస్త్రములు కావ్యాలంకారకళాశాస్త్రములు ప్రకృతిశాస్త్రములు మొదలగు శాస్త్రములు రససమ్మేళనమును బొందిన విధము ప్రశంసనీయము.

అద్వైతము ద్వైతము వేదాంతము శాక్తేయము ప్రకృతి సౌందర్యవిలాసములు మొదలగు విద్యలు కళలు కావ్యరససిద్ధికి వినియోగపడుట దుర్లభము. ఆదికాలమునుండియు విశ్వకల్యాణ సాధనము లైన మతములకును కావ్యములకును మతములకును శాస్త్రములకును తత్త్వములకును కళాసౌందర్యములకును ఆధ్యాత్మికసాధనములకును భౌతికసాధనములకును సంయోగసాహచర్యములు దుర్లభము లగుటయు, ప్రతిఘటనము ప్రబలుటయు దురదృష్టము. విశ్వమంతయు నేకశ్రుతిలయరాగరసబద్ధ మై విశ్వపరిణామమును విశ్వకల్యాణమును బొందుటకు మహాత్ములు తమ శక్తిని వినియోగించు

చున్నారు. మతాచారములు శృంగారవిలాసములు విశ్వేశ్వరారాధనమునందు మేళగించుట ప్రకృతిధర్మ మైనను, ప్రతిఘటనము ప్రకృతధర్మముగ నున్నది. గోపాలరావు గారు ప్రాచ్యపాశ్చాత్త్య సంస్కారములం దనుభవజ్ఞులు, పండితకవులు, రసజ్ఞులు; కావ్యమున ఉభయసంస్కారములను రసయోగానందమునందు లగ్నము చేసిరి.

సౌందర్యమంజరి హృద్య మైన భావమంజరి. గంభీరభావకాంతులు భావాంబరమునందు ప్రకాశించుచు భావకావ్యప్రకాశమును రంజింపఁజేయుచున్నవి. కావ్యలక్ష్యము సాత్త్వికశృంగారరసపర మైన భావసౌందర్యరసానందము. అయినను, ప్రపంచవాసనలు పాశ్చాత్త్య సంస్కారము రాజసతామసరూపసౌందర్యధ్యానములు శృంగారపర మైన రూపసౌందర్యము నారాధ్యము చేసినవి.

కవికర్షకుఁడు పాఠకప్రకర్షకుఁడు —
ఉభయులున్ సరసగుణోదారఘనులు;
ఏతద్ఘనసువర్ణవృష్టిలబ్ధంబు
ప్రకృతి-చిత్రసమానసుకృతిఫలంబు!
రసికశుకవ్రజారాధనలందు
వారి నామంబులు వందనీయములు! IV, 157-162

కావ్యము సరళ మైన మంజరీద్విపదయందు రచియింపఁబడినది. శైలి మంజులారావమును గలిగి శ్రావ్యముగ నున్నది; భావానురూపముగ సంస్కృతప్రాయముగ నున్నను, సహజమాధుర్యమును గలిగి యున్నది. భావకాఠిన్యము భాషామార్దవమునకు కొంతవఱకు ప్రతిబంధకముగ నేర్పడియుండును. కావ్యము గోపాలరావు గారి చిరకాలసాహిత్యోపాసనమునకు పక్వఫలము. సంకల్పానురూప మైన శక్తి, శక్తికిఁ దగిన భావ, భావమునకుఁ దగిన రసము, రససాధన మైన

కావ్యము, కావ్యమునకుఁ దగిన కృతిపతి. సౌందర్యమంజరి కావ్యప్రపంచమునందు నవరసానందానుభవమునకు సాధనముగ నున్నది.

## పరమార్థము

ప్రపంచపరిణామమందు పురుషార్థము పరమార్థము. పురుషార్థమునకు సంకల్పము సాధనము; పురుషార్థసాధనము లైన విశ్వవిలాసములు సంకల్పప్రభావములు. సంకల్పశక్తి శాంతశివసుందర విలాసముల నుపాసకుల ననుగ్రహించుచున్నది. సంకల్పము శక్తిపరిణామమును, శక్తి భావపరిణామమును, భావ రసపరిణామమును, రస మనురాగపరిణామమును, అనురాగము సౌందర్యపరిణామమును, సౌందర్యము కావ్యకళాపరిణామమును పొందుచు, పురుషార్థమునకు సాధనముగ నున్నది. సౌందర్యము వాగర్థజ్ఞేయ మైన శక్తి, భావార్థయోగము. కావ్యమునకు శక్తివిలాసము లైన భావార్థములు భావరూపములు, దేహాత్మలు. భావగుణరూపానుభూతుల వైభవవిలాసవైచిత్ర్యములు యోగశాస్త్రకళాకావ్యములు. కావ్యరసానందమునకు యోగశాస్త్రకళాకావ్యము లన్యోన్యాశ్రయము లైన విధమునకు హృద్యకావ్య మైన సౌందర్యమంజరి నిదర్శనము. కావ్యకళారచనలందు రూపసౌందర్యరసానందము సామాన్యము; భావసౌందర్యరసానంద మసామాన్యము. ద్వివిధరసానందముల సంయోగము పురుషార్థము. సౌందర్యమంజరి సామాన్యాసామాన్యము లైన రూపానుభవముల యోగమున శృంగారప్రేమగానమును మనోహరముగఁ జేయుచున్నది. గోపాలరాయకవి గారి భావకావ్యరచనాదక్షత్వము కావ్యమునందు సర్వత్ర ప్రత్యక్ష మగుచు, కావ్యమీమాంసకు పాత్రముగ నున్నది. ఆంధ్రసారస్వతపరిషత్తు గోపాలరాయకవి గారి భావకావ్యరచనాదక్షత్వమున కొసంగిన "కవిశేఖర" బిరుదము, కృతిపతి శ్రీవిక్రమదేవవర్మ గారి ధన్యవాదములను బడసి, సార్థక మైనది.

ఈ భావకావ్యమునకు పరిచయవాక్యములను వ్రాయఁదగిన సంస్కారము పాండిత్యము వాసనలు లేకపోయినను, పౌరోహిత్యమునకు సాహసించినందులకు గుణగ్రహణపరాయణులు మన్నింతురుగాత !

రసహృదయోపాసకు లైన ఆంధ్రసాహిత్యోపాసకులు సౌందర్యమంజరికి స్వాగతంబు నొసంగి ఆదరింతురుగాత ! శృంగారరస విలాసచతుర యైన సౌందర్యమంజరికి జనకుఁడు గోపాలరావు గారు విద్వత్కవీంద్రుఁడు ; వరుఁడు విక్రమదేవవర్మమహారాజు విద్వత్కవీశ్వరవిభుఁడు. కృతికర్తృకృతిపతులు, తరుణభావోపాసకపోషకులు. పరమేశ్వరానుగ్రహమును ఆంధ్రసాహిత్యలోకాదరణమును ఉభయులును బడయుదురుగాత !

శ్రీముఖసం. పుష్య
శు. ౨ బుధవారము }

కా. నాగేశ్వరరావు

## ౨

## ఆంధ్రపత్రికారజతోత్సవసంచికనుండి

( *20* సెప్టెంబరు *1933* )

ఇది కాళ్లకూరి గోపాలరావు పంతులు గారు రచియించిన ఖండకావ్యము. కవి యాంధ్రలోకమునకు చిరపరిచితుఁడు. వారిని ప్రశంసింప నవసరము లేదు. నూతనముగ సృజింపఁబడిన యీ కావ్యరత్నమును ఆంధ్రలోకమునకు పరిచయపఱుచు కోరిక కలిగినది. * * * * *

ఇది ప్రేమగీతము. ప్రేమోపనిషత్తని దీని ననవచ్చును. కవి తాను,

"బాల్యంబునుండి నీ భక్తుండ నంబ!"

యనినట్లు సౌందర్యోపాసకుఁ డనియు, ఆ యుపాసనాబలమున

"సౌందర్యమంజరీసౌమ్యరూపమును"

పొందవలయు నని యాశించి సాధన చేసె ననియు, పాఠకులకు సుబోధము కాఁగలదు. కవి యా సాధనయొక్క ఫలితముగ సౌందర్యమును సాక్షాత్కరింపఁజేసికొని, తన్మయుఁడై యుండి,

"ఆ యైక్యమందె తా నావిర్భవించు
సృష్టికిం బ్రతిసృష్టి హృద్యకావ్యంబు."

అని చెప్పినవిధముగ, ఈ ప్రేమోపనిషత్తునకు మంత్రద్రష్ట యైనాఁడు.

* * శృంగారమె విషయముగాఁ గల యీ కావ్యకన్యకను శృంగారమున కతీతుఁడై జనకచక్రవర్తివలె "మిథిల కాలదు నా" కని చెప్పఁగల చిత్తసంస్కారము గలిగి సార్థకనాముఁడైన విక్రమదేవప్రభువర్యునకు సమర్పించుటచే, కవికిని కావ్యమునకును ధన్యత చేకూరినది.

* * * * *

గొప్ప యుపజ్ఞతో కూడిన కావ్యమును ఆంధ్రుల కిచ్చి, వారి కృతజ్ఞతకు కవి పాత్రుఁ డయినాఁడు.

వున్నవ లక్ష్మీనారాయణ

JEYPORE (VIZAG.)

"సుందరమహాలు",
చెన్నపురి.
౨౯. ౧౧. ౩౩.

శ్రీయుత కాళ్లకూరి గోపాలరావుకవిగారూ,

ఆంధ్రసారస్వతపరిషత్తు మీ భావచరిత కవితకు మెచ్చి "కవిశేఖర" యను బిరుదమును మీ కొసంగుటవలన నాకెంతయో సంతసము గలిగెను. నా ధన్యవాదములను గైకొనుడు.

ఇట్లు,
శ్రీ విక్రమదేవవర్మ,
శ్రీజయపురాధిపతి.

# స్వవిషయము

ఈ గ్రంథమం దేమేమో క్రొత్త పోకడలు పోయితి ననుకొను చున్నాఁడను. సహృదయులగు పాఠకమహాశయు లవధరించి, ఇందలి యాథార్థ్యమును నిర్ధారింతురుగాత!

అప్పకవి ననుసరించి, మంజరిలో ప్రాసయతి పనికిరా దని కొందఱి మతము. తరువోజయు ద్విపదయు మంజరియు తుల్యగణ బద్ధము లైనను, మొదటి రెండును ప్రాసనియమమును పాటించుటచే జాతులలో చేరును; అందు ప్రాసయతి కూడదు. కాని, ప్రాసనియమము లేని మంజరి యుపజాతులలోనిది; కనుక, సీసాదులలోఁబలె ఇందు ప్రాసయతి చెల్లును. ఇది హేతువాదనిరూపితము, నా మతము. అట్లే, అప్పకవి నతిక్రమించి, పాండికతో కలిపి చదువఁదగిన యొకటి రెండు చోట్ల, పదము పాదాంతమున విఱిగి మఱు పాదములోనికి చొచ్చెను. ఇంతకును, ఇట్టి విఱుపు లాంధ్రమున శైలికే కాని, ఛందస్సునకు సంబంధించినవి కావు; విశేషించి, శైలికి వన్నె పెట్టునవి.

సభాముఖంబున నా కృతిని ప్రతిగ్రహించి నా కనన్య సామాన్యగౌరవము గావించిన సాహిత్యసమ్రాట్టు శ్రీ శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవవర్మమహారాజులుంగారికిని, మున్నుడి వ్రాసి మన్నించిన డాక్టర్ సర్ యస్. రాధాకృష్ణన్ గారికిని, కావ్యపరిచయరూపమున నా గ్రంథమును చరితార్థము చేసిన శ్రీయుత దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారికిని నా కృతజ్ఞతాభివాదములు.

గ్రంథకర్త



శ్రీరస్తు

# సౌందర్యమంజరి

## I సంకల్పము

శ్రీరస్తు, శుభ మస్తు! శ్రీగణనాథ!
అఖిలమూలాధార! యవధారు దేవ!
ఇట్టి రా జిట్టి పౌఁ జిట్టి రో జింక
దొరకుట యరు దని దొరఁకొంటిఁ గృతికి.

* * * *

శుచియు నుజ్జ్వలము నై రుచు లూరఁజేయు
రసము శృంగారంబె రాజయోగంబు!
రాజాశ్రయమునకు రాజమార్గంబు
రసరాజ; మదె సమాశ్రయము నా కిపుడు.

* * * *

ఆ సహస్రాక్షసహస్రశీర్షుండు
నటరాజదేవుండు నిటలనేత్రుండు
ద్విపదసహస్రమూర్తిత్వ మింపారఁ
దాండవం బొనరించి ధన్యతం గూర్ప,

బహుపాశబద్ధ మై పరువు గోల్పడిన
నాల్గు పాదంబుల నడక నా కేల?
ప్రాసపుంబోట్లును వర్జనీయములు;
నిరుపహతంబు మంజరియె గ్రాహ్యంబు.

భారతీదేవి శోభారతీదేవి
స్వైరవిహారలాస్యప్రభావంబు
భావంబు నర్థానుభావంబుఁ జూప
మంజరీచ్ఛందమే మంజురంగంబు!

మంజరి సర్వసంపత్కరోపాయ
మం బని, తద్రచనకుఁ బూనినాఁడ.

* * * *

ఎక్కు డఱపులు పా లీని బట్టలకు!
భావార్థశూన్యభాషావిడంబనము,
అన్వయక్లేశంబు, వ్యర్థపదంబు,
అప్రస్తుతాలంక్రియావిశేషంబు,
కవికర్షకారంభకాలోచితములు;
దున్నపోతులవలె దున్నుట కొదవు!

కవిగోపుఁడు ప్రసాదకామధేనువును
శృంగారలసదలంక్రియను గ్రహించి

యఖిలపదార్థంబు లను మేఁత మేపి
ధ్వనిగుణబద్ధగాఁ బాలించి పితికి,
రసపయోవృష్టి మానసభాండమందుఁ
దగు మాత్రము తపోగ్నితప్తం బొనర్చి
యింబారఁ బ్రకృతిదధిం బేరఁబెట్టి
భావమంథానమ్ముఁ బట్టి మథింప,
నవనవకావ్యార్థనవనీత మొదవి
యమృతతుల్యం బయి యలరారుచుండు!

పూర్వుల పోకడల్ పోల్చికొనంగ
సంప్రదాయంబులు సంప్రతించుకొన
లక్షణగ్రంథముల్ సాయం బొనర్చు;
"ఇఁకమీఁది రచనలు నిటె యుండవలయు"
ననుట యర్థవిహీన మైన మతంబు,
అదె గతానుగతిక మనిపించుకొనును!
ఒకటె యచ్చుందిమ్మ నొత్తుటం గలుగు
బొమ్మ లే రీతి మోదమ్ము ఘటించు?
ఒక్కటి చూచినం, దక్కిన వెల్లఁ
జూచినట్టులు గాదె? చోద్యంబు నిదునె?

పరిభాష మాయ శాస్త్రరహస్యసృష్టి;
నా మాయ యను పటం బటు త్రోచివైచి,
కావ్యభాష, నఖండనవ్యత మెఱయ,
విశ్వరూపంబుఁ జూపెడివాఁడె సుకవి!

రసపదార్థమును, గిరాకి కొలంది,
నుత్పన్న మగుచుండు సత్పాత్రలందు;
విక్రమార్కునిఁ బోలు పృథ్వీశుఁ డున్న,
కాళిదాసును బోలు కవి గల్గకున్నె?

సకలతంత్రస్వతంత్రకవులఁ గొల్చి
తచ్చక్రవర్తిత్వ మిచ్చ నూహించి,
సర్వతోముఖరసాస్వదచమత్కార
నవతఁ జూపు తదీయకవిత నర్థింతు.

* * * *

సృష్టి యదృష్టపరేచ్ఛాఫలంబు,
మార్పరానిది; దాని మాట యిం కేల?
లయము తప్పని, దది భయజనకంబు;
ఇప్పటినుండియు నేటి కా చింత?
స్థితి మనోజ్ఞంబును, స్వేచ్ఛామయంబు;
ఆనందసంసిద్ధి కారాధ్య మెపుడు!

సృష్టిస్థితిలయంబు లెసఁగించు శక్తి
స్థితిధురంధరత సంస్తుతిపాత్ర మిపుడు!

స్థితి విలాసంబు భారతి విలాసంబు
రసవిలాసంబు దర్పకవిలాసంబు
జోడింతు, నానందశోభ పెం పొంద;
నా రచియించు సౌందర్యమంజరికి
సర్వాంగసౌష్ఠవసంపదం గూర్చి,
యివి పరమార్థసంహిత లగుఁగాత!
మఱి, కుమారీస్వయంవర మంకితముగ,
దీవించి యేతత్కృతిని సమర్పింతు
రాజున కభినవభోజున కసమ
తేజున కాశ్రిత దేవభూజునకు.

## 2

శృంగారకృతి కెత్తు సింగార మేమి?
రసికజనామోదకుసుమదామంబు!

* * * *

ఆంధ్రాంగ్లవిద్వాంసు లైననే కాని,
నా దారి సుగమంబు గా దెన్నొ యెడల.

నృపతియుం గార్యదర్శియు సమాత్యుండు
నాప్తమిత్రుండు — వీ రందఱుం జూడ,
నుభయపాండిత్యాఢ్యు; లభయస్వాతంత్ర
విఖ్యాతి కీ భాగ్యంబె వీ లిచ్చె నాకు.

వారలు సరసధీసారథు లగుట,
ఘను లుదారులు గుణైకగ్రాహు లగుట,
నోడ లెఱుంగని తెంపు నుత్సాహ మొదవె;
పోయిన జవ్వనంబును బొడచూపె.

వారల మెప్పించు భావం బొకింత
యుం దున్న, ధన్యుండ నే నని యెంతు!

శ్రీరస్తు

# సౌందర్యమంజరి

## II శక్త్యుపాసన

సర్వకారణశక్తి చైతన్యశక్తి
దివి నమృతాకృతిన్ దీపించుచుండు;
జగ మఖిలంబుఁ దచ్ఛక్తిమయంబు,
ప్రకృతియందే యది భావ్యమై తోఁచు! 4

## 2

వైద్యుతి తచ్ఛక్తి పరిణామమూర్తి;
అది పంచభూతతత్త్వాభ్యంచితంబు:
స్థితిరూపశక్తి పృథ్వీతత్త్వ మేమొ?
ప్రవహించు శక్తి యప్తత్త్వంబొ యేమొ? 8
అపకర్షణాకర్షణాత్మకశక్తి
సంఘర్షణజము తేజస్తత్త్వ మేమొ?
సవిధశక్తుల పరస్పరసముద్ద్రావ
ణత్వంబు తా వాయుతత్త్వమో యేమొ? 12

అంతరాళము లెల్ల వ్యాపించు శక్తి
తలపోయ నాకాశతత్త్వంబొ యేమొ?
మించిన భక్తి భావించి భావించి
నే నీ మహాశక్తిఁ గా నెంచువాఁడ!

* * * *

జగ మెల్ల వినిపించు శబ్దాంకశక్తి
చతురాస్య రాణి భాషాదేవి యేమొ?
విశ్వసంపద లెల్ల వెలయించు శక్తి
విష్ణుహృదిందిరావిభవంబొ యేమొ?
మార్తాండబింబాగ్నిమహిమ యీ శక్తి
త్రినయనార్ధాంగి రౌద్రిదేవి యేమొ?
ఆరయ శక్తిత్రయాత్మక మైన
యీ శక్తి మూర్తిత్రయీశక్తి యేమొ?
మించిన భక్తి భావించి భావించి
నే నీ మహాశక్తిఁ గా నెంచువాఁడ!

* * * *

అఖిలస్థలముల బాహ్యాభ్యంతరముల
నిండియుండెడి శక్తి నిర్భరం బరయ;
ఈ శక్తిసంపద లిటు చీలకున్న,
నిత్యలయం బగు; నిల్చునే జగము?

శక్తిశివాఖండసంయోగలీల
యే లోకకల్యాణ మే లీలఁ గనిన ;
ఆనందజనక మై యతిశయించెడిని ,
ఈ వైభవంబు నే భావింతు నెపుడు !

## 3

భక్తజనంబుల భక్తి కొలంది
బాహ్యాయంత్రంబులం బ్రభవించి, శక్తి
యోర్పు మీఱఁగ సమస్తోపచారములు
చేసెడి నేర్పు విచిత్ర మెంతయును !

దూరసంభాషణ దూరశ్రవణము
దూరదర్శనము నుత్సుకతఁ గల్గించి ,
జగ మెల్ల నొక రంగముగ మార్చివైచి
వివిధవినోదముల్ వెలయించుచుండు !

స్థలజలాంబరయానసౌకర్య మొసఁగి
దీప మై వెల్గి వీచోపులు వీచి ,
భువి నపూర్వస్వర్గముగ మార్చివైచి
సకలసౌఖ్యంబు లొసంగుచునుండు !

భగవతి యీ శక్తి వాత్సల్య మెనయ
భక్తసంతుష్టికై పడు పాట్లు చూడ ,

శివుఁడు విశ్వంబు రక్షించెడి కొఱకు
కాలకూటము తిన్న కథ స్ఫురియించు!
రౌద్రమూర్తుల కృపారస మద్భుతంబు;
తత్తత్త్వమే యమితత్త్వ మన్నిటను!

* * * *

పూర్వవిద్యుజ్జిహ్వాముఖ్యనామములు
జంతువైద్యుతికి దృష్టాంతముల్ గావె?
బాహ్యాయంత్రముకంటె భావయంత్రంబు
శక్తిమంతం; బది సలుపని దేమి?
దూరసంభాషణ దూరశ్రవణము
దూరదర్శన — మివి తుల్యంబు లైన,
స్వాత్మసంసిద్ధవరానుగ్రహంబు
ఆకాశయానకాయవ్యూహములును
అన్యకాయప్రవేశాదులు నింక
నెన్నెన్ని యద్భుతకృత్యముల్ లేవు?
ఓ మహాశక్తి! నా యుల్లంబునందు
నిల్చియు, న న్నేల నిదురపుచ్చెదవు?
భక్తిమైఁ బ్రణమిల్లి ప్రార్థించువాఁడ,
మేల్కొల్పుమమ్మ, నీ మే ల్కూర్పుమమ్మ!

* * * *

తేజంబు నాదంబు నైజంబు లైన
గుణము లీ యుభయశక్తుల కెంచి చూడ;
భరణంబునకుఁబోలె హరణంబునకును
హేతుభూతము లగు నియ్యవి రెండు.
ఆచారలోప మావంత గల్గినను,
నెత్తి యణఁచు నంట నిక్క మీ రెంట!

బాహ్యయంత్రజమట్ల భావయంత్రజము
లోకకల్యాణార్థలోలుపం బగుత!
'దానహీనులు తపోధను' లను దూఱు
నిర్మూల మగుఁగాత నిరవశేషముగ!

భావయంత్రములు శాపంబులకొఱకు
బాహ్యయంత్రంబు లసహ్యసంహృతికి
దుర్వినియుక్తముల్; దురితంబు మాన్ప
శక్తి విశ్వైశ్వర్యశస్తి నర్థింతు!

## 4

ప్రకృతిశక్తి యనెడి పాలసంద్రంబు
ప్రాచ్యులు పాశ్చాత్త్యు లచ్యుతద్రఢిమ
భావయంత్రంబులు బాహ్యయంత్రములు
నా నొప్పు కవ్వముల్ పూని మథింప,

వైరాగ్యభాగ్యరూపములు ధరించి
యుద్భవించిన లక్ష్మి! యుత్సాహజనని!
ఒక్క మా ఱెటు చూడు, మ్రొక్కి వేఁడెదను;
వైరాగ్య, మదియును భాగ్యంబె యైన,
భాగ్యసంగతిని సంభావ్య మై యొప్పు;
ఉభయభాగ్యంబుల విభవంబు నిమ్ము!

*        *        *        *

తైజసశక్తి! నాదబ్రహ్మమూర్తి!
ప్రకృతిస్వరూపిణీ! ప్రత్యక్షశక్తి!
అత్యంతభక్తిమై ధ్యానింతు నిన్ను;
చల్లఁగా మెల్లఁగా, నుల్లాస మొలయ
దయ మీఱ, నాదు చిత్తమున స్ఫురించి
పరమార్థశబ్దప్రభలు గూర్పు మమ్మ!
సౌందర్యమంజరీసామ్యరూపమున,
నా కాంచిన తెలుంగు ననుఁ జూపనిమ్ము!

శ్రీరస్తు

# సౌందర్యమంజరి

## III భాషోపాసన

అఖిలార్థదాయిని యగు కల్పవల్లి
భాషామతల్లి యే ప్రతిజాతి తల్లి ;
ప్రజలకు నేకోదర ప్రీతిఁ గూర్చి,
జాతికుటుంబముల్ సవరించుచుండు !

* * * *

జ్ఞానతీర్థంబులన్ జలకంబు లార్చి,
సంగీతసాహితీ స్తన్యం బొసంగి,
నాకంబు భూలోక మేకం బొనర్చు
కల్పవల్లీడోలికలఁ బండఁబెట్టి,
భావహస్తములతోఁ బైపయి నూఁచి,
పరమార్థములు జోలపాటలు పాడి,
ప్రకృతివినోదముల్ పరికింపఁజేసి,
ముద్దు బిడ్డలఁ బెంచి మురియుచునుండు.

భాష పెంపకయున్నఁ, బసులము గామె?
భాష పెంపే మానవప్రాభవంబు!

## 2

భాషామహాదేవి! భగవతీ! శక్తి!
ప్రణవస్వరూపిణీ! వందనం బమ్మ!
ముల్లోకముల గతుల్, ముడి విప్పినట్లు,
చూపఁ జూపంజేయ నోపెదు తల్లి!
విశ్వశక్తికి శబ్దవిభలు రూపములు;
ఆ రెండు నీయందె నైక్యంబు నొందు!
పరమార్థశబ్దప్రభాప్రభావంబు
త్వత్సౌమ్యరూపంబు దర్శనీయంబు!

చంద్రమోమండలసంపద వీవు;
మోహిని వై సుధాభుక్తిఁ గూర్చెదవు!

* * * *

జనని వయ్యును మఱి శాశ్వతి వయ్యు,
జన్య వై కడు విలాసముల లయింతు!
ఆ విలాసమె రసం, బదియె నీ శక్తి;
విశ్వశక్తికి రసావిష్టశక్తిని

ముడివెట్టు శక్తివి, ముఖ్యదేవతవు!
వరములు శాపముల్ త్వచ్ఛక్తి గతులు!
విశ్వభావంబవు, విశ్వనేత్రమవు;
విశ్వవిశ్వేంద్రియవిభవంబ వీవు! 32
సిద్ధవు, సాధ్యవు, సిద్ధివి నీవ;
సాధనంబవు నీవ, సకలంబ వీవ!

* * * *

మేదోంబురుహపీఠ! మేధాస్వరూప!
వాయుచాలనమృదుపాదోపహతుల 36
లలి శ్వాసకోశభస్త్రల నొత్తికొనుచు,
భావహస్తంబులు పైపైకిఁ జాఁచి
వక్త్రావయవవర్ణఫలకముల్ మీటి,
నీవు శ్రుతుల్ దీర్చి నియతి వాయించు 40
గళయంత్ర మఖిలమంగళకరం బంబ!
వేదవేదాంగముల్ వేదాంతములును
సాహితీగ్రంథముల్ సంభాషణములు
నీ గానమహిమముల్; నిత్యంబు నీవు 44
లోకమాత్ర సమస్త మేకగీతముగ
పాడుచుందువు తల్లి! స్వరకల్పవల్లి!

* * * *

బ్రహ్మదండపు వీణ, బ్రహ్మాండవీణ,
కమ్రవీణ, కపాలకచ్ఛపీవీణ,
దేవత్రయాత్మకత్రిగ్రంథివీణ,
నాదులే తంత్రులై నటియించు వీణ,
అఖిలశక్తులకు మూలాధారమైన
గణపతిపూజతోఁ దొణఁగెడి వీణ,
త్రిజగజ్జనకము స్వాధిష్ఠానమైన
యోగాగ్నికుండమం దుదయించు వీణ,
మణిపూరతేజంబు మహిమంబు నెఱపఁ
గనులకు మిఱుమిట్లు గలిగించు వీణ,
అద్భుతరీతి ననాహతస్థితిని
ప్రణవశబ్దంబులం బలికించు వీణ,
కల రూపుల విశుద్ధకలకంఠగతుల
వాఁగెడి భాస్వరస్వరపూరవీణ,
మానసహంసంబు లీన మౌ లీల
నాజ్ఞానువర్తి యై యలరారు వీణ,
బ్రహ్మరంధ్రము సహస్రారంబు దాఁకి
యమృతంబు వర్షించి యలరించు వీణ,
సూక్ష్మాతిసూక్ష్మ తేజోరేఖఁ బోని
కుండలి నాడించు గుప్తార్థవీణ,

అమ్మ! మా యమ్మ! నా కిమ్ము నీ వీణ;
దానిఁ బల్కించెడి తలఁపు జనించె!

* * * *

వాగర్థగతశక్తి! వాక్యార్థశక్తి!
కర్తృకర్మక్రియాకారవు నీవు,
సృష్టిలయస్థితు లీవె చేసెదవు;
నీ శక్తి మూర్తిత్రయీశక్తి యరయ!

కర్మం బెటో యకర్మకతమై లయింప,
నీవె బ్రహ్మానందనిలయ వయ్యెదవు;
క్రియయును నిష్క్రియానియతి లయింప,
నీవె బ్రహ్మాంబ వై నెగడుచుండెదవు;
నీవు నేనుం దక్క నిల్వ దెయ్యదియు,
వాఁ డెవ్వఁడో కానరాఁ డెందుఁ గన్న;
నీవె నేనును నేనె నీవు నయ్యెదము,
ఉను సముచ్చయ మదే యోగకారకము;
అదియు నుభయమధ్యమందు లయింప,
నీవు నే నేక మా భావంబె మనము!

ఆ నైక్యమందె తా నావిర్భవించు
సృష్టికిం బ్రతిసృష్టి హృద్యకావ్యంబు ! 84

* * * *

భక్తిమైఁ బ్రణమిల్లి ప్రార్థించువాఁడ,
బాల్యంబునుండి నీ భక్తుండ నంబ !
దయ మీఱ నాయం దుదయ మందవమ్మ,
సౌందర్యమంజరీసౌమ్యరూపమున ! 88

శ్రీరస్తు

# సౌందర్యమంజరి

## IV రసోపాసన

జీవకోటుల స్వతస్సిద్ధధర్మముల
చేష్టలే రసముల సృజియించుచుండు;
తత్తద్విచేష్టల తత్త్వముల్ గూర్చు
నానందవిభవంబె యరయ రసంబు!

సర్వజీవులకును సామాన్యమైన
ముఖ్యధర్మంబులు మూఁడౌటఁజేసి,
మూఁడు రసంబులు మూర్తీభవించు!
శృంగారవీరశాంతాంగిరసములు
మైథునాహారనిద్రాధిభూతములు;
సృష్టిస్థితిలయంబు లీ మూఁట నిముడు!
ఈ రసత్రితయమే యెంచి చూడంగ
సచ్చిదానందప్రశస్తి వహించు!

*    *    *    *

మిథునభావంబందు మెలఁగు నుజ్జ్వలము ;
సంయోగసౌహార్దసంతోషకరము !

ఆహారమం దగునదె వీరరసము ;
సంపాదనావనసమ్మోదకరము !

నిద్రలో శాంతంబు నెగడు ; నయ్యదియె
అవ్యక్తసౌఖ్యస్పృహానందకరము !
కర్త లయించుటం గర్మంబు సున్న ;
శాంతరసము ప్రదర్శనయోగ్య మగునె ?

* * * *

శృంగారవీరప్రవృత్తులం జూడ ,
భోగభాగ్యాపేక్ష పూర్ణ మై తోఁచు ;
ధర్మశాస్త్రంబులు తత్త్వబోధనలు
శోకరోగభయాద్యనేకదుర్దశలు
పట్టి బంధింపని పక్షంబునందు ,
ఈ రెండు రసములం దెసఁగెడి శక్తి
విశ్వశక్తియుఁ బోలె విలయంబు గూర్చు ;
ఆనంద మొసఁగు సౌమ్యస్వరూపమున !

## 2

శృంగారవీరంబులం గల్గునట్టి
మరణంబులం గాని స్ఫురణకు రాని
శాంతరసంపుఁ బ్రస్తావం బదేల ?
అది ప్రవృత్తిని దుర్లభార్థంబు గాదె ?
లయసృష్టిమధ్యంబులం బ్రవర్తిల్లి,
బ్రహ్మోపాసన మై పరఁగెడి నేమొ ?

* * * *

స్థాయి జుగుప్సగాఁ దనరు బీభత్స;
మది యొక రస మౌనె ? యానంద మిడునె ?

* * * *

వీరం బనఁగ, రణవీరంబె రసము;
గుణవీర మనునది గుణమాత్ర మగును,
దానధర్మదయాదినానావిధంబు
శీలంబు రస మౌనె, యే లీలఁ గనిన ?

* * * *

రణవీరమును మించి రౌద్రంబు గలదె ?
అయ్యది వీరరసావస్థ గాదె ?

* * * *

కరుణంబును భయానకంబు రసములె?
శృంగారవీరంబులం గాననగుచు,
అవి రసావస్థ లై యతిశయించెడిని;
వానికిం బ్రత్యేకభావంబు సున్న!

* * * *

హాస్యాద్భుతచమత్క్రియావిశేషములు
కావ్యగుణంబు లై క్రాలెడింగాక,
పరమవినోదంబు పరఁగించుఁగాక,
రససిద్ధి వానికే దెసఁ గానరాదు;
వికటవికారప్రవృత్తి రసంబె?
తా నసాధారణత్వంబు రసంబె?

సమరసవర్తిదృశ్యద్రష్టలందుఁ
గేవలవిపరీతభావముల్ గూర్చి
హాస్యాదులు రసంబు లను భ్రాంతిఁ జేసి,
దృశ్యపాత్రల రసంబే యుండ దనిరి;
దృశ్యపాత్రల లేక, యే రసంబేని
ద్రష్టల కెట్లు ప్రత్యక్ష మై తోఁచు?

దృశ్యపాత్రల లేకయే, వానివలనఁ
గలుగుచుండు మనోవికారంబు లెల్ల

రసములే యగునేని, రసము గా దేది?
కృతకంబు గాదు, ప్రాకృతము రసంబు!

* * * *

పరమార్థసాధకభక్తిప్రవృత్తి
గతగుణోపాసనాక్రమమందుఁ జూడ, 64
శృంగారవీరముల్ రెండే రసములు
విశ్వాత్మకంబు లై విలసిల్లుచుండు!

ఈ రెండు రసములం దేదే నొకండు
నాటకంబునఁ బ్రధానం బన నేమి? 68
ఈ రెండె కాని, తదితర మెయ్యదియు
రసము కా దనకయ రసము గా దనుటె!

## 3

అహమున జనియించి యహమహమికల
వర్ధిల్లు జగము; తత్పథమె జీవితము; 72
ఆత్మ యక్షయంబుగ నాశ నేమిగను
దనరు చక్రము జీవితప్రవర్తనము!

శృంగారవీరముల్ రెండు రసములు
కామసంతర్పణగతు లెంచి చూడ; 76

పాత్రద్వయంబునం బ్రభవిల్లి ప్రబలి,
యన్యోన్యజయకౌతుకాయత్తసరణి,
సమరపర్యంతంబు సమముగా నడచి,
నైక్యంబున లయించి యానంద మొసఁగు!

* * * *

ఇంటిలోపలి పోరు శృంగారరసము,
వీథిలోపలి పోరు వీరరసంబు;
ఉభయపాత్రానందవిభవ ముజ్జ్వలము,
ఏకపాత్రానందహితము వీరంబు;
ప్రేమైకబీజంబు శృంగారరసము,
క్రోధైకబీజం బగున్ వీరరసము!

* * * *

క్రౌర్యంబు హింస శోకంబు జుగుప్స
భయద మా వీరంబు పాలింటఁ గల్లు;
సంపాదనమునకు సంరక్షణమున
కాధార మగుటచే నారాధ్య మైన,
గుణవిశేషములతోఁ గూడినం గాని,
వీరంబు సంతోష మే రీతిఁ గూర్చు?
ఉక్తియుద్ధంబులు రక్తి గొల్పినను,
రక్తపాతంబు లాసక్తి గొల్పెడిని?

ధర్మశాంతులను సంస్థాపించు టనిన,
ఈ వీరము నణంచుటే యర్థ మగును!
గణుతింపఁగ ననాదికాలంబునుండి
వీరంబు నణఁచుటే విశ్వోద్యమంబు;
వీరంబునం గాని వీరం బణంగ
దనుచు వీరంబుచే యర్పించు జగము.
ఇది యెన్నఁ డణఁగునో యెఱుఁగంగరాదు,
ఇందన్క నణఁగని దిఁక నణంగెడినె?

* * * *

ఏ విధిం జూచినన్, శృంగారరసమె
రసరాజ మనఁజాలి రంజించు హృదిని;
శుచియు నుజ్జ్వలము నై స్తుతిపాత్ర మగును;
అది యొక్కటియె రసం బన్పించుఁ దుదకు!

స్త్రీపురుషైక్యంబు జీవేశ్వరైక్య
తుల్య మై యానందదుగ్ధాబ్ధిఁ దేల్చు;
తాత్కాలికానందధన్యతవలన
శాశ్వతానందసాక్షాత్కార మొసఁగు!

## 4

రసము ల వెన్నేని, రస మెట్టిదేని,
రససముత్పత్తిమార్గము సమానంబ;

సుముఖంబో విముఖంబో — చో ప్పేది యైన ,
అన్యోన్యచేష్టల ననుభవించుచును
అనుగుణచేష్టల నాచరించుచును
దృశ్యపాత్రలు రసస్సృష్టి గావించు !

ప్రకృతియో నాటకరంగమో శ్రవ్య
కావ్యమో దృశ్యంబు గావచ్చు నెదియొ ;
ప్రకృతియం దనుభూతభావ మై యొప్పి ,
నటులందుఁ దద్భావనటన మై యొప్పి ,
శ్రవ్యకావ్యములఁ దచ్ఛక్తి యై యొప్పి ,
రసము దృశ్యంబుల నెసలారుచుండు !

* * * *

రస మొక శక్తి మానసగతరక్తి ;
ఆ మహాశక్తి , భావోచితసరణిఁ ,
దత్తద్గుణవిచేష్టితములందు వెలసి
తత్తద్విచేష్టలు తాన యై యొలసి
ద్రష్టల హృదయదర్పణముల మెఱసి
తత్తద్గుణవిచేష్టితములు కల్పించు !

ద్రష్టల భావనాద్రఢిమ కొలంది
ద్రష్టల భావమార్దవము కొలంది

ఆంతరంగికముగ నాంగికంబుగను
ద్రష్టల నాడించుఁ దన నాట్యగతుల; 132
అవహిత్థఁ ద్రోసిరా జని కట్టివైచి
తదనుగుణవిచేష్టితములకు దించు!

* * * *

అరయ నయస్కాంత మయము నె ట్లట్ల,
రసము ద్రష్టలను దర్శనమాత్రమున నె 136
తనదు సంగడి కీడ్చుకొని తనిపెడిని!
ఉత్తరాభిముఖ మై యుద్ధరించెడిని!

ఉర్వీతలంబందె యూర్ధ్వలోకైక
సౌఖ్యసాకల్యం బొసంగి మన్పెడిని! 140

## 5

రసమె యానందంబు, రసమె బ్రహ్మంబు;
అఖిలరసంబులు నానందగతులు!
విశ్వలిపిలిఖితవిశ్వకావ్యమున
నానందరసముల కైక్య మ్మెసంగు! 144

తద్భావనానందధన్యత యొకటె
సృష్టిస్థితులకు విశిష్టఫలంబు!
అభినవసృష్టి మహానందకరము;
దానికిం దా విచ్చు ధర్మంబె లయము! 148

సృష్టిస్థితిలయంబు లెట్లు భిన్నములు?
ఒకదాని పరిణామ మొకటి యూహింప!
ఈ పరిణామలీలాపరమాణు
పరిణామచిత్రంబె పరమకావ్యంబు! 152

* * * *

మహితపుణ్యాత్ములౌ మనుజోత్తములకె
యఖిలరసాస్వాదనానందసుఖము;
కావ్యసృష్టిస్థితికర్తలు వారు,
ఆ మహామహుల నే నాత్మ నుతింతు! 156

కవికర్షకుఁడు పోషకప్రకర్షకుఁడు —
ఉభయులున్ సరసగుణోదారఘనులు;
ఏతద్ఘనసువర్ణవృష్టిలబ్ధంబు
ప్రకృతిచిత్రసమానసుకృతిఫలంబు! 160
రసికశుకప్రజారాధనలందు
వారి నామంబులు వందనీయములు!

* * * *

రసమహాశక్తి! మానసగతరక్తి!
ప్రార్థించువాఁడ! నాయందు దయయుంచి, 164
సౌందర్యమంజరీసామ్యరూపమున
నటియింపఁగదవమ్మ, నను జూడనిమ్మ! 166

శ్రీ రస్తు

# సౌందర్యమంజరి

## V మన్మథోపాసన

భావజుఁ గన్నట్టి దేవాధిదేవ !
భావజు తల్లి సంపత్కల్పవల్లి !
ఇంద్రియాతీతులై యెసఁగెడి మిమ్ము
సేవించు టెట్టులో భావింపఁజాల !

మిము మించి సకలలోకములు పాలించు
మీ మన్మథుని సేవ మీ సేవ గాదె ?
ఆత్మజు నభ్యుదయముకన్నఁ గలదె
సంతోషహేతువు జనకుల కెందు ?

మీయంతవాఁ డయ్యు, మీయండపల్లె
తన యాటపట్లుగా, ననయంబుఁ ద్రుళ్లి
విహరించు బిడ్డని వింత వేడుకల
సుద్దులు మీ కెట్లు ముద్దు గాకుండు ?

భక్తిమైఁ బ్రణమిల్లి ప్రార్థించువాఁడ!
సుప్రీతులై మీరు మీ ప్రజకెల్లఁ,
బుట్టువు లన్వర్థములుగ సుఖింప,
నైశ్వర్యము లొసంగుఁ డనుకంప మీఱ!

## 2

భావజదేవ! సంభావ్యస్వభావ!
భావసామ్రాజ్యాధిపత్యానుభావ!

నీ తలిదండ్రు లా ప్రాఁత దంపతులు
విశ్వాత్మకులు, మఱి విశ్వరూపకులు;
విశ్వభావజుఁడవై వెలయుదు వీవు,
ప్రతిభావజుండవై ప్రతిభఁ జూపెదవు!

* * * *

నీవు కాయజుఁడవో? భావోద్భవుఁడవో?
అతనుండ వగుట ప్రత్యక్షాంశ మరయ;
తనుభావములు రెండు దంపతు లగుట,
నుభయోద్భవుఁడ వంచు నూహింతు నిన్ను!

యాథార్థ్యమునం దనన్యజుఁడవు నీవు,
కాయికమానసికములు నీ గతులు;

ఈవు స్వాయంభువ, విదియె తత్త్వంబు;
నీ మహామహిమంబు నిరుపమానంబు!

* * * *

అర్థంబు కామార్థ, మర్థకామముల
యర్థంబు ధర్మ; మీ యర్థంబు చూడ,
మూఁటిలోఁ గామంబె ముఖ్య మై తోఁచు;
ఇహపరానందైకహేతువు గాన,
మోక్షంబునకు నిదే మూల మై యొప్పు!

తత్పురుషార్థాధిదైవంబ వగుటఁ,
గామదేవుం డన గణుతి కెక్కెదవు!
తలఁచునంతటనె ప్రత్యక్ష మయ్యెదవు;
సుప్రసన్నుండ వై శుభముఁ గూర్చెదవు!
నీవంటి సులభుండు దేవుండు కలఁడె?

* * * *

ఆద్యంతరహితనిరంతరప్రకృతి
చందంబు కామంబు బిందురూపంబు!

ఆత్మసంకలనంబు వ్యవకలనంబు
గుణకంబు భాగహారణము — నిం దేదియు
బిందుతత్త్వంబును భేదింపలేదు!

పూర్వాంశమం దిది పూజ్య మై తోఁచు,
నుత్తరాంశమున సద్యోదశకముల
సృజియించు; నిది సాంఖ్యసిద్ధమతంబు!

* * * *

బిందువే బీజంబు, బిందువే కుజము,
బిందువే ఫల; మదే విశ్వరూపంబు!

బిందుఫలం బిచ్చు వృత్తి ప్రవృత్తి,
బిందుఫలము తిను వృత్తి నివృత్తి;
ఈ నివృత్తిని నీ ప్రవృత్తియే తోఁచు,
నీ లేనియది వృత్తిగో లేదో యేమొ?

ఉభయవృత్తులయందు నుద్భవించెడిని
నాదబిందుకళావినోదమోదంబు;
ఉభయవృత్తులును శాంత్యుదయంబునందు
మురిసి బ్రహ్మానందముం గూర్చుచుండు!

* * * *

కార్యసర్వస్వంబు కామయజ్ఞంబు,
నిష్కామమందును నెగడుఁ గామంబు;
తద్వినోదం బెల్లఁ ద్వద్విలాసంబు,
ఆ విలాసంబె రసాపాదకంబు.

నీ మథనము లేక నెగడునే రసము ?
శృంగారమన్మథు నెఱుఁగు జగంబు ,
అన్ని రసంబుల నున్నాఁడ వీవు ;
నవమన్మథుఁడ వైతి నా బుద్ధి కిపుడు !

* * * *

ముమ్మూర్తు లొక్కటైన మూర్తివి నీవు ,
సృష్టిస్థితిలయంబు లీవె చేసెదవు !
ఎల్ల కార్యంబులు కృష్ణుండు తీర్ప
బలరాముఁ డవతారఫలము గన్నట్లు ,
సర్వసృష్టియు నీవ సమకూర్చుచుండ
నీ యన్న స్రష్ట నా నెగడుచునుండు !
పేర మాత్రమె నీదు పిత స్థితికర్త ;
స్థిరవిశ్వసంసృతిస్థితిభర్త వీవ !
నీ వైరి లయకర్త నే నని యుబ్బుఁ
గాని, నీ కూర్చు సంగ్రామరంగములు
బీభత్సశుగ్భీప్రభృతిదుర్భరములు
లయతరంగంబులు ; లయకర్త వీవ !
పేరాస యెఱుఁగని పెరిమె నీ సొమ్ము ;
నీవంటి వీరుండు నిజ మెందు లేఁడు ;

శృంగారమదనుండె చింతింప బ్రహ్మ;
వీరమన్మథుఁడె యా విష్ణుదేవుండు;
శాంతకాముఁడె మహేశ్వరుఁడు యోజింప;
ఆ త్రిమూర్తుల మూర్తి యతనుండు నిజము!

* * * *

కేవలశృంగారభావజుం డైన
మన్మథు సేవయే మధుర మా సేవ!
అరయ భక్తికిని బ్రహ్మానందమునకు
స్మరతంత్రజాతముల్ నిరుపమోపమలు;
ఉపమేయముల మించు నుపమానములుగ
పొడకట్టు నొక్కొక్కప్పుడు తలపోయ!

* * * *

కర్మగుణాధీనకాయధర్మమున
జ్ఞానాంబకప్రయోగానూనమహిమ
నంచితంబుగఁ జూపు పంచబాణుఁడవు,
ఇంద్రియరూప! యతీంద్రియాటోప!

* * * *

అతులితాటోప! మహానందరూప!
సౌందర్యకైతవమందస్మితాస్య!

హావభావోద్యానహరిణసంచార !
లీలావిలాసైకఖేలావిలోల !
భ్రూలతాకోదండభుజబలోద్దండ !
వీక్షణబాణైకవిద్యాప్రవీణ !
యౌవనవనమృగయావ్యవసాయ !
విజయంబు నీ కనన్యజమహాదేవ !

నీ వినోదప్రీతి నీ కృపానిరతి
నీ యహింసారతి నిస్తులితములు ;
ఒకదాని రెండు చేయుదురు వేఁటరులు ,
రెంటి నొక్కటి చేయు మృగయుండ వీవు !

ఒరు లాడు వేఁట సంహరణశీలంబు ,
క్షతిజశోకంబు , శోణితనిపాతంబు ,
క్రూరకృత్యంబు , జుగుప్సాకరంబు ;
నీ వేఁట యన్ననో నిత్యహర్షంబు ,
రక్తవిజృంభణోద్రిక్తచిత్తంబు ,
దాంపత్యసంతానసంపాదకంబు ,
సంతానసదృశవాంఛాఫలదంబు ,
అఖిలలోకైకసమారాధితంబు !

*   *   *   *

రసరాజమున కీవు రాజవు, దాని
స్థాయిభావము రతి ప్రేయసి నీకు;
భావప్రపంచంబు ప్రాజ్యరాజ్యంబు,
వికచలోచనములు విజయధ్వజములు!

వ్యభిచారిభావవిభావానుభావ
సాత్త్వికభావముల్, సమయానుసరణి,
సమరసాధనములు సైన్యసంతతులు
మంత్రులు మిత్రులున్ మరియు బంధువులు —
అవి యివి యని తెల్ప నగునె యిప్పట్ల —
నీదు సర్వస్వమై ప్రాదుర్భవించు!

కవిసాహసికులు నీ కథ లెల్ల మార్చి
యేమేమొ వ్రాసినా; రెవరు నమ్మెదరు?

* * * *

గ్రహచక్రమున ధనుర్ధరుఁడవు నీవు;
త్వత్సమకోణపార్శ్వస్థిత కన్య
మీనవీక్షణ నీదు మేటి తూపులకు
సహియింపలే, కన్యాసాహాయ్యవాంఛ
మిథునభావం బంది మించి, నీ యెదుట
నిర్భీకముగఁ దాను నిలువంగ నేర్చె.

ఒంటరిపాటునం దుండ నీ వొరులు;
జంటలం గావించి సంతసించెదవు!

* * * *

నీ ప్రపంచమె వేఱు! నీ రాజ్యమందు
రాగసంయోగవియోగంబు లనెడి
సృష్టిస్థితిలయంబు లెసలారుచుండు;
పుట్టని పుట్టు, గన్పట్టని యున్కి,
చావని చా, వెంత చాతుర్య మయ్య!
నీ శక్తి మూర్తిత్రయీశక్తి మించు!
నీ సృష్టిలోఁ గల్గు నిద్దంపుటొపు
రూపు చూపుంగోపు తీ రెందు లేవు!
ఎది సుఖాస్పదమొ యయ్యదిమె నీ నీతి,
స్త్రీలును బురుషులు — ద్వివిధంబు జాతి,
ఆనందమార్గంబె యరయ నీ రీతి;
నీ స్థితిలోఁ గల్గు నీతియు జాతి
రీతి — సమస్తంబు ప్రేమతత్త్వంబు!
ప్రేమమే నీ తత్త్వ మేమో కదయ్య?
ఆనందకరముగ నాకాశవీథి
వివిధశక్తిప్రవాహావిరాజమాన

మేఘసంయోగంబు మెఱసెడి భాతి,
నీ స్థితియుం దెల్ల నెగడుచునుండు
భావాంబరమున బ్రభాస్ఫురణంబు;
అది యనుభవవేద్య మా బ్రహ్మమట్లు!

స్థావరజంగమజీవులయందె
కాదు, శక్తులయందుఁ గనవచ్చు నీదు
సామ్రాజ్యమహిమంబు; జడములం దద్ది,
గానరాకున్నను, గలుగకయున్నె?
పరమాణుసంయోగపాటవం బెల్ల
నీ మహిమమె యంచు నే నెంచువాఁడ!

* * * *

ఇంద్రియానందంబు నెసకొల్పికొనుచు
నున్నంతనే పూరకుండువే కాని,
తరుణంబు చిక్కిన దర్పించి మించి
భావంబునను మహాబలుఁడ వయ్యెదవు;
స్వాంతంబునను ప్రభంజనుఁడ వయ్యెదవు;
శరపరంపరల నూపిరి సల్పనీక
వడి వడి వర్షించి సడి సద్దు లేక,
యల్లకల్లోల మాన ట్లొనర్చెదవు!

నీ గాలివానలు నిగిడెడి వేళ
నాహారమును నిద్ర యవి నిండు సున్న ;
జీవసంక్షోభంబు భావంబె యెఱుఁగు ;
నీయ ట్లదృశ్యముల్ నీదు కృత్యములు !
అల నివృత్తింబోలె నంతర్ముఖంబు
నీ ప్రవృత్తి ; తదీయనియతి చిత్రంబు !

* * * *

ఈరేడు జగములం దే రీతిఁ గనిన ,
నీ ధాటి కెదు రొడ్డి నిలువలే రెవరు ;
పరిమితిభేదంబు పరఁగెడింగాక ,
నీ విజయం బదే నిక్కంబు తుదకు !

మేధావులందు నీ వేధ యుత్కటమె
యైనను , లలిత మై యలరారుచుండు ;
కృష్ణలీలలె దీనికి నిదర్శనంబు !
రౌద్రమూర్తులయందు రభసంబు మెండు ,
వె ఱ్ఱెత్తినట్టులు విహరింత్రు వారు ;
రుద్రుని చేష్టలే రూపించు దీని !

జ్ఞానులయందు నీ చర్య మితంబు ,
నీతి తప్పిన నైన నాతి యొక్కటియ ;

బ్రహ్మానర్తనమె యీ భావంబు దెల్పు !
తపసులే యల్లాడి తపియించి రనఁగ, 188
తక్క మానవుల ప్రస్తావం బ దేల ?
మారునిచే నోడితి వందురే కాని ,
యారసి చూడం గుమారసంభవము
నీ పూర్ణవిజయంబునే చాటుఁ గాదె ? 192

* * * *

పరమకల్యాణాత్మపరిణయం బనెడి
నీ నోము నోఁతురు నిఖిలజనంబు ;
కాని, సంకల్పవిధానముల్ వేఱు
వారి వాసస్థానవాసనలట్లు ! 196

ప్రాచ్యజనంబులు భావదంపతులు ,
పరమార్థబుద్ధితో వ్రతము పాటింత్రు ;
అదియె స్వర్గము మోక్ష మనుచు భావింత్రు ;
అధమపథము మార్గ మని యైన నెంత్రు ! 200

పాశ్చాత్త్యజనములు బాహ్యదంపతులు ,
బహుళేంద్రియప్రీతి వ్రతకుతూహలము ;
‘ బ్లూ సినీమాలు ’ చూపుదురు చూచెదరు ,
భ్రమ దిగంబరవిహారము లొనర్చెదరు ! 204

నియమసంగవిశేషనిరతి యిక్కడను,
నియమభంగవిశేషనిరతి యక్కడను!

కొఱుకుట గిల్లుట కోర్కు లిచ్చోట,
కొప్పుసూదుల గ్రుచ్చు కోర్కు లచ్చోట;
ఎంత పోకిరివయ్య! యింతలో జనుల
నున్మత్తులం జేసి, యుల్లసిల్లెదవు!
ఏకత్వమందే యనేకత్వ మొలయు,
ఆ యనేకత్వమం దైక్యంబు గనుమె
పరమార్థమార్గంబు; ప్రాచ్యపాశ్చాత్య
సుగుణమేళన మెన్న జగదుత్సవంబు!
భావమేళన మెన్నఁ బరమోత్సవంబు!
మేళనమందె సమ్మిళిత ముత్సవము!

* * * *

నవశక్తిరూప! యానందప్రదీప!
మానసశక్తినిర్మథనప్రతాప!
రసశక్తిఘంట నీ రాజ్యంబు పంట;
నీ యతనుతయె కాన్పించు నన్నింట!
ఆ త్రిమూర్తుల శక్తి వై తనర్చెదవు;
శక్తుల శక్తివి, సర్వశక్తుఁడవు,

శక్త్యతీతుండవు, శక్త్యధికుఁడవు;
నీ మహామహిమంబు నిరుపమానంబు! 224

* * * *

మన్మథదేవ! నమస్కారమయ్య!
'కామి గాకయె మోక్షగామి కాఁ' డనెడి
సూక్తి సంభావించి, యుక్తియుక్తముగ
నీ ప్రభావాణువు నెపముగా నిపుడు 228
సౌందర్యమంజరీసరసాభిధాన
శృంగారకృతిని సృజించినవాఁడ;
అనుకంప నా కృతియం దావహించి
స్థిరముగాఁ, గాంచుమా దిగ్విజయంబు! 232

## 3

ఒకచోటి నష్టి యిం కొకచోటి పుష్టి;
కాయయౌవన మది కడచను కొలఁది,
భావయౌవనము ప్రభావంబు చూపు!
స్థిరతరానుభవైకసిద్ధి వార్ధకము 236
భావయౌవనమును వర్ధిల్లఁజేయు!

* * * *

యౌవన దేవతా ! భావాధిరూఢ !
మన్మథసామ్రాజ్యమహనీయపీఠ !
నిఖిలక్రియాశక్తినిధివి, సమస్త
పాటవజీవకళాటోపఖనివి !
నీవు లేని జగంబు జీవన్మృతంబు ;
జీవాధిక వటంచు భావింతు నిన్ను !

ముమ్మాటికిని నీకు మ్రొక్కి, వేడెదను,
బ్రతుకునన్నాళ్లు నన్ బాసిపోకమ్మ ;
భావయౌవనపాటవము చూపనిమ్మ !

శ్రీ రస్తు

# సౌందర్యమంజరి

## VI కుమారీస్వయంవరము

సృష్టికిం దల్లి ప్రాచీమహాదేవి,
స్థితికుమారి విలాసగతియె ప్రతీచి;
ఉభయకల్యాణగుణోపేత గాన,
నా కృతిసుత లయానందస్వరూప!

సృష్టిస్థితిలయంబు లెసఁగించునట్టి
పరమేశుఁడే తన ప్రాణేశుఁ డనుచు,
ఆ త్రిమూర్తుల మూర్తి నానందమయునిఁ
బ్రేమించి నా కుమారి వరించి మించె!

చతురాస్యు విబుధాగ్రసరుఁ బరమేష్ఠి
విక్రము నచ్యుతు విష్టరశ్రవుని
రాజశేఖరుని సర్వజ్ఞు నీశ్వరుని
నా యాత్మజ వరించి నను గౌరవించె!

* * * *

సకలకళావికాసక్రియాధుర్య
నిక్కళావతి కోరు టేమి యబ్బురము ?
సరసభావవిలాసచతుర యీ యువతి
భావయౌవనపాటవవిలాసి యైన
సరసునిఁ జతురుని వరియింపఁ దగదె ?
భావదాంపత్యంబె ప్రస్తుతం బెందు !

* * * *

విద్వత్కవీంద్రుని బిడ్డ యీ వధువు ,
విద్వత్కవీశ్వరవిభుఁ డా వరుండు ;
ఎటు గన్న , సర్వాంబ యీ స్వయంవరము !
కాని , సందియ మొండు గల దంతరాత్మ :
అతఁడు మహారాజు , సితకీర్తి , యాంధ్ర
విశ్వవిద్యాలయశాశ్వతస్థితికి
కాలోచితక్రియాక్రమమహోన్నతికి
బద్ధకంకణుఁ డైన ప్రభువు ; నే నన్న ,
సామాన్యసంసారి ; నా మాట వినునె ?
ఈకొనునే యతం డీ వియ్యమునకు ?

* * * *

రాజు సత్సంతానరమణుం డటన్న
విదితార్థమునఁ దాను వెలయకయున్నె ?

రసమూర్తి యీ సువర్ణమనోజ్ఞమూర్తి
యాకర్షణంబున నలరకయున్నె?
దాంపత్యసంధాత దగ్గఱ నుండ,
ఇంకను నా కేటికీ వృథాచింత?
పారిజాతంబు గృహారామమందుఁ
గలుగ, నెవ్విధి నైనఁ గలుగునే కొఱఁత?

## 2

మన్మథదేవ! నమస్కారమయ్య!
నిన్నుపాసించి నేఁ గన్న దీ కన్నె;
నీదు పోలికలును నీదు పోకడలు
నెంతయు విలసిల్లు నీ తన్వియందు:
అక్షరరూపచిత్రాంచిత మైనఁ,
కేవలానంగ యీ భావసంజాత;
రసము సమ్మోహనాస్త్రముగా గ్రహించి,
భావవైభవమునం బ్రబల నుంకించు!
ఈమె యద్భుతచర్య యేమి చెప్పుదును?
పుట్టి పుట్టక మున్నె పురుషవరేణ్యు
నొక్కని వరియించి యుబ్బందొడంగె;
ఇదియు నీ తంత్రమో యేమో యెఱుంగ!

పుట్టిని పూఁబోండ్ల మోహింపఁజేయు
దిట్ట యెవ్వరో నీకుఁ దెలియదే? నీవు
నభిమానశిష్యులం దగ్రగణ్యుండవు,
సుమనోవినోద, విక్రమదేవవర్మ!

రసలుబ్ధకాళులు కొసరి పైకొంచు
ముసరక మున్నె యీ కుసుమకోమలను
వరు చేతఁ బెట్టినన్, బను వెల్లఁ దీఱు;
ఆలస్య మగునేని, యమృతంబు విసము!

*   *   *   *

రాముని గూర్చి విశ్వామిత్రమహాని
జనకున కానందజనకుఁ డైనట్లు,
నా కల్లునిం గూర్చి ననుఁ దనియించి
జనకునంతటి జనకునిఁ జేయుమయ్య!
నీ బలం బంతయు నా బలం బనుచు,
తంత్రంబు మెఱయ నా మంత్రి వయ్యెదవొ?
హితుఁడ వయ్యెదొ? పురోహితుఁడ వయ్యెదవొ?
సకలంబు నీవ వై, సరసలోకమున
రహి నించు మన్మనోరాజ్యాధిపత్య
పదవి కే లోటును బాటిల్లకుండ,

సందేశహారణంబు సలుపంగదయ్య ;
వియ్యంబునకుఁ దుల్యవిభవంబు వలయు! 68

ఈ విషయమున నీ కేమి చెప్పినను,
మత్స్యజాతుల కీఁత మప్పఁ బూనుటయె ;
ముప్పునం బుట్టిన ముద్దుల బిడ్డ
సంగతి గానఁ బ్రస్తావింపవలసె : 72

## 3

“ సౌందర్యమంజరీసార్థకాభిధయె
సౌమనస్యంబును జాటెడి ! ” ననుము ;
“ రాగపరాగసారస్యమరంద
కౌతుకసౌరభ్యకళ లొప్ప ! ” ననుము . 76

“ నిత్యసౌభాగ్యయు నిత్యయౌవనయు
నిత్యప్రసన్నయు నిత్యానుభోగ్య ;
రాజ్యనాయికవోలె, రమణి యిక్కావ్య
నాయిక యానందదాయిక ! ” యనుము . 80

“ నీ కా వరారోహ , నీ వా లతాంగి
కెంతయు ననురూపు ; లిది నిక్క ! ” మనుము .

“ సంతానములఁ బ్రతిసంతానము లిడి
నృపతులు మున్ను వరించిరి గాని, 84

సంతానసంతాన! సంతాన మదియె
నిన్ను వరించుట నీ పేర్మి!" యనుము.
"అఖిలార్థసంపద లవి కాన్క!" లనుము,
"సాలంకృతమ్ము కన్యాదాన!" మనుము;
"మన్ను మిన్నుం గూర్చు మంటపస్థలిని
ధ్వనివాద్యములతోడి పరిణయం!" బనుము.
"జయపురీరాజ్యలక్ష్మి యమేయశక్తి
నిన్నుఁ జేపట్టిన తెన్నున వచ్చి,
కీర్తిసఖీకరాకృష్ట సోత్కంఠ
యీ పద్మగంధి నిం జేపట్టు!" సనుము.
శారదాపాదితశాసనంబునకు
భయపడునో యేమొ, నయశాలి రాజు?
"అభినవాభ్యుదయయే యైన, నీ రమణి
ప్రౌఢ!" యంచును దెల్పి, "వరియింపు!" మనుము.
"శారదాశాసనసారం బి!" దనుము;
"శారదాదేవ్యుపాసకుఁడ వీ!" వనుము.
ఇదె మంత్రకీలకం; బింతకు మించి
నా చెప్పఁగల దేమి? నీ చేయఁగలదె!

* * * *

చతురుండు, హితకారి, సారస్యమూర్తి,
కవిమార్గదర్శి, భూధవు కార్యదర్శి! —
కాదు కా, దతని సంగాతంబుఁ దలఁచి
తడఁబడితిని! — కార్యదర్శిమాత్రుండె?
కేవల మాంతరంగికకార్యదర్శి,
సెట్టి లక్ష్మీనరసింహ నాయకుఁడు!

మనమె త్వదర్చనామంటపం బనఁగ,
గృహమును వేఱె వర్ణింపఁగావలెనె?
నా కాప్తుఁ, డతని యింటనె బస డిగుము;
సకలోపచారముల్ జరగు నీ కచట!

నిజభక్తుఁ డొనరించు భజనలలోన
ప్రియశిష్యుఁ డొనగూర్చు విందులలోన
నను మఱతువో యేమొ? నాకు సంశయము;
చేతిలోఁ జెయి వేసి, చెప్పుము నిజము!

అతని యోగక్షేమ మరసెడి వేళ
నేమి చెప్పెదవో, మ ఱేమి చేసెదవో?
అతఁడు భూజాని సమ్మతిని గ్రహించి,
నాకుఁ దెల్పెడియ ట్లొనర్పు మింపార!

"ఇంత మాత్ర మనుగ్రహించినం జాలు ;
కన్యాప్రదాత దా 'ధన్యోఽస్మి !' యనుచు,
కనకాభిషేకంబు గాంచినయట్ల
సంతసించు !" నటంచుఁ జల్లఁగాఁ జెప్పుము.

* * * *

మఱియొక విషయంబు : మంత్రిసత్తముఁడు
రాజ్యవర్ధనకీర్తి ప్రభుహితవర్తి
ఓబలరెడ్డివంశోదధిచంద్రుఁ
డాంగ్లవిద్వన్మణి యాంధ్రాభిమాని
లలితగుణుండు పుల్లారెడ్డి ఘనుఁడు
పెండ్లికిం బెద్ద యుర్వీనాథు నొద్ద !

ప్రాజ్ఞుండు సర్వతంత్రస్వతంత్రుండు
సరసావతంసుండు పరమార్థపరుఁడు
సకలకళావికాసక్రియాఢ్యుండు
విద్యావినోది గంభీరుం, డతండు
నీయంతవాఁ ; డింక నే నేమి చెప్పుదు !
క్రొత్త మిత్రుండు, తద్గుణ మీవె కనుము.

"ఎన్ని పెండ్లిం డ్లైన, నిట్టివి కావు ;
శాశ్వతసుశ్లోకశస్త మీ పెండ్లి.

కావునన్, దీని మహావైభవముగఁ
గావింపు!" మనుము; "సంభావింపు!" మనుము.

*     *     *     *

నీ జయపురి కేఁగు నిర్మలాధ్వమున
స్వాగతం బనును విశాఖపట్టణము;
ఇంకొక మిత్రుఁ డయ్యెడ నున్నవాఁడు,
ఆతని యాతిథ్య మందు మోనాఁడు! 144

అతఁ డెవ్వ రని యాత్మ ననుకొనియెదవో?
* నావలెనే యుండు, నీ వెఱుంగుదువు;
ఆంధ్రోద్యమప్రియుం, డఖిలార్థవేత్త,
గంగాప్రవాహప్రసంగసంగతుఁడు, 148

---

* నెల్లూర జరగిన యాంధ్రమహాసభాసమావేశమున శ్రీ ప్రభల లక్ష్మీనరసింహము పంతులు గారు గంభీరోపన్యాసము గావించిరి; అది ముగిసినంతనే, నేను సభామంటపము వెలుపలికి వెళ్లితిని; సభ్యు లనేకులు పరుగెత్తుకొనుచు వచ్చి, "అద్భుతముగ మాటాడితి!" రని నన్నభినందించిరి; సారూప్యముక్తి యిట్టిదే కదా యని సంతసించితిని. ఇట్టి సందర్భము లనేకములు గలవు; ఇటీవల నేను విశాఖపట్టణము వెళ్లి వారియింట నుండ, పెక్కండ్రు వారి తమ్ముఁడ నని భ్రమపడిరి.

నయవాది, సార్థకనాముండు, ప్రభల
లక్ష్మీనృసింహుండు, లలితగుణుండు!
రాజపురోహితుం, డా జగజ్జెట్టి
రాజ్యాంగసూత్రధారణదక్షుఁ; డతఁడు 152
తలఁచునంతనె సమస్తము కల్గు ననఁగ,
మంగళసూత్రసుసంగతి యెంత?

నీ యాట సాగ దా నిశ్చలు నొద్ద,
నీ శరశక్తియున్ నిగుడ దయ్యెడల; 156
ఘన మమోఘము నమస్కారబాణంబు,
దానిం బ్రయోగించి ధన్యతం గనుము!
"మంత్రతంత్రంబుల మహిమంబు మెఱయ,
గట్టిగా ముమ్ముళ్లు పెట్టింపు!" మనుము; 160
"ఆమోదభరితపుష్పాంజలుల్ చల్లి,
ఈ వధూవరులను దీవింపు!" మనుము.

* * * *

ఇనుఁడు నాకును మిత్రుఁ డని వ్రాసినాఁడ;
సన్ముహూర్తంబున సమయంబు నరసి, 164
ఈ శుభలేఖ నీ విమ్ము భూపతికి
వాయుదేవుఁడు సౌరభము నిచ్చు మాడ్కి!

## 4

పోయినట్టులు పోయి పోకయేపోయి
యింతలో మరలి రా నేమిటి కయ్యా?
అవశకునంబె? యే మైనఁ గావలెనె?
అడిగినన్, బదులు మాటాడ వేమయ్యా?

యుగములు చెల్లె; నిసుఁగవె నీ వింక?
ఆటలే కాని, యన్య మెఱుంగవయ్యా!
ఏ మనుచున్నాఁడ? వింకొక్క మాఱు
విస్పష్టముగఁ జెప్పి వినిపింపవయ్యా!

* * * *

"నా చేయలేనిది నీ చెప్పఁగలదె?
న న్నెఱింగియు నీవు నా శక్తి గనవు;
నీ లేఖ నా కేల, నీ మాట లేల?
పోయి వచ్చితిఁ, గార్యమును ఫలియించె!

"నను మనశ్శక్తిరూపునిఁ గాదె కనెదు?
మానసవేగంబు మానసశక్తి
యీ వెఱుంగవె? వాని కిం కేవి సాటి?
అవియె వానికి సాటి, యన్యముల్ లేవు!

“ఆఁడుబిడ్డలఁ గన్న యాపన్నజనుల
కష్టముల్ నా యెఱుంగనియవి కావు ; 184
మతికి జాడ్యము కల్గు, మతియే గతించు ;
కాకున్నఁ, గవివి యీ గతిఁ బ్రవర్తిలెదె ?

“ఆ జేని సారస్య మరయలేవైతి,
నీ కృతి మహిమంబె నీ వెన్నవైతి ; 188
అప్పగింతల వేళ నాశీర్వదించి —
నీ లేఖ యిదె — దీని నీవే చదువుము !”

అనుచున్నవాఁడవే ? యనుచు నా వీఁపు
తట్టుచున్నాఁడవే ? ధన్యుండ నైతి ! 192

శ్రీ రస్తు

# సౌందర్యమంజరి

## VII కృతిసమర్పణము

శ్రీమన్మహారాజ! శ్రితకల్పభూజ!
ప్రథితసద్ధర్మ! విక్రమదేవవర్మ!
రాజ్యకావ్యయశోనురక్తనాయికలు
ఫుల్లాబ్జముఖులు, శ్రీభూనీళలట్లు, 4
వామాంకమందుఁ బార్శ్వములందుఁ జేరి,
దీవన లను సుమనోవృష్టి నడుమ,
చిఱునవ్వుమోములు సిగ్గుమై వాంచి,
శోభావిశేషధారాభరస్ఫూర్తి 8
నభిషేక మొనరింప — నాత్మాంశభవుని
సింహాసనప్రతిష్ఠితుని నిన్ జూచి,
తనుఁ జూచుకొనునట్లు తనిసి యుప్పొంగు
శ్రీమహావిష్ణు వాశ్రితకల్పశాఖ 12

యాయురారోగ్యంబు లైశ్వర్య మెల్ల
సమధికంబుగ నీకు సమకూర్చుఁగాత !

మంజులస్వర్ణాభనుమంగళకేతు
గురురాజకవిబుధస్థిరవిలాసముల
నెసఁగు దివ్యసమితి యనునకు నీకు
శుభఫలోపాయనవిభవం బొసఁగుత !

* * * *

రాజ్యంబు రుక్మిణి, రాధ యశంబు ;
ఈ కావ్యకన్యకయే సత్యభామ !
మన్మనశ్శక్తిస్యమంతకమణిని
భామావిలాసైకపరమరత్నమును,
నిరుపమానం బగు గురుభక్తి మెఱయఁ,
గాన్కగా నీ కీయఁగలిగితి ; నింక
నీ కృష్ణలీలలు నిత్యహార్షముగఁ,
గల్పపుష్పంబులం గై సేయుమయ్య !

* * * *

నవనవశృంగారనైపుణీతృప్త
రాజ్యనాయిక భుజాగ్రము పట్టి కుల్క,
అన్యసాధ్యము గాని యానంద మిచ్చు
స్వకవితాకాంత ముచ్చట ముద్దు లాడ,

రసరాశి గాన, నాశ్రయ మపేక్షించి
కావ్యనాయిక నీదు కౌఁగిళ్లఁ దేల, 32
స్వేచ్ఛావిహారనిస్సీమమనోజ్ఞ
కీర్తినాయిక చూచి కెరలి నర్తింప,
సవతుల కయ్యాల సవసవ లేని
శ్రీకృష్ణమూర్తి వై చెల్వొందుమయ్య! 36

నవనవార్థంబులన్ నవరసామోద
నటన చూపెడి సుమనఃప్రపంచమున,
అభినవకృష్ణరాయఖ్యాతి గనుము;
ఆంధ్రభోజుఁ డనంగ నభినుతిం గొనుము! 40

* * * *

రాజ్యలక్ష్మి యమేయరాగంబు వెలయఁ
దడవిన కీర్తిచందనచర్చ లొలయఁ
బరిమళించెడి శివంకరకరాబ్జమునఁ
గర మనుగ్రహ ముంచి గ్రహియింపుమయ్య, 44
వైభవోద్యద్విజయాభివాదకము
సహృదయాశీర్వాదసారపూరకము
సౌందర్యమంజరీసరసనామకము
పట్టాభిషేకాంకపారితోషికము! 48

శ్రీ

భరద్వాజగోత్రిక

కాళ్లకూరి రాజయామాత్య పుత్రక

రసౌచిత్య రచనాఢ్య

గోపాలరాయ

ప్రణీత

సౌందర్యమంజరి

సంపుల్ల యయ్యో

శ్రీ రస్తు

# సౌందర్యమంజరి

## ప్రతిగ్రహమహోత్సవము

(ఒక సహృదయుఁడు)

"పూర్వము ప్రభువులు, కవులు పండితులు కవిపండితకల్పకములు నయి యుండెడివారు. వారి యాస్థానములు కవిపండితమండలికి స్థానము లయి యొప్పియుండెడివి. మహారాజులు కవులను పండితులను సకలసంపదలతోఁ దులదూఁగఁజేసి వారితో నిరంతరవిద్యావినోదములఁ దేలుచుండెడివారు. కవులును పండితులును సుఖమయజీవను లయి సరసము లగు కృతులను రచియించుచు వాఙ్మయవికాసమునకు దోహదము చేయుచుండెడివారు. తత్కృతులను ప్రభువు లాదరపూర్వకముగ తమ పేరున కంకితము గావించుకొని కృతికర్తల నగ్రహారాదులతోడను గజాంతైశ్వర్యముతోడను సత్కరించెడివారు. ఈవిధముగ నాయాకాలమున వెలసిన మహారాజులయాదరపోషణములవలననే కావ్యము లనేకము లుత్పన్నము లయినవి; వాఙ్మయ మనంతముగ వృద్ధిఁజెందినది. అట్టిప్రభువతంసములు కథాశేషు లయిపోయినను, వారి నామములు వాఙ్మయపోషణగాథలు చరిత్రప్రసిద్ధము లయి వాఙ్మయముతోపాటు చిరంజీవిత్వమును బడసినవి. ఇది యంతయు రెండుశతాబ్దులకు మునుపటిమాట. నేఁ డది యంతయు కథలు పురాణములు. తరువాత క్రమముగా నట్టిప్రభువులు అట్టికవులు పండితులు

దేశమున నరుదు కాఁజొచ్చిరి. కావున వాఙ్మయవికాసమను శూన్య ప్రాయ మయినది. కాని నిన్న నేఁట మరల ప్రభువు లొండొకళ్లు వాఙ్మయపోషణమునకు దొరఁకొనుట దేశసౌభాగ్యచిహ్నము.

జయపుర సంస్థానాధీశులు శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవవర్మ మహారాజులుంగారు పండితుఁడు కవి కృతికర్త రసికవతంసము. నిరంతరవాఙ్మయసమ్యక్పర్షణము కవిపండితపోషణము ఔదార్యము తత్సహజశీలములు. ఇట్టియుత్తమగుణవంతుని జయపురరాజ్యరమ స్వయము వరియించినది. తానయి వలచి చేపట్టిన యాసహధర్మచారిణీ బాసటగొని వాఙ్మయారామమున మధురకావ్యఫలములం బండించి సహృదయహృదయముల కామెత యిచ్చుట యావిద్వత్ప్రభువతంసమునకు ధర్మము. సింహాసనము నధిష్ఠించినది మొదలు చేపట్టిన మేఘదూతాది కావ్యకన్యలు గాక, మరల మొన్నమొన్న శ్రీకాళ్లకూరి గోపాలరాయని అభినవప్రసవము, నవ్యాలంకారరమణీయ, నవనాగరకలక్షణలక్షిత, 'సౌందర్యమంజరి' పేరిటి కృతికన్యయు నాప్రభువును వరియించి, తతోధికరూపాలంకారవతి యయి తనుఁ గన్నతండ్రికి కన్యాపితృత్వ కష్టమును తొలఁగించినది.

కృతికర్త గోపాలరావుగా రాంధ్రసారస్వతప్రపంచమున కవిపండితగౌరవమునకు పాత్రు లయినవారు. తత్కృతులే తత్కవితా పాండితీగౌరవములకు నిదర్శనములు. ఆసుకృతి తనసుకృతి నను రూపవరుని కరముల నర్పించి చరితార్థుఁ డయినాఁడు.

కృతి సప్తసంతానములలో నుత్తమము, చిరంజీవము; కన్న వారికి కొన్నవారికి పేరుకీర్తులను పెద్దఁజేయునది. ఇట్లుభయతారకమగు కృతి కారణముగా బాంధవ్యము గలిసిన కవియును మహారాజును ధన్యులు. * * * * *" — భారతి, జూలై 33.

ధన్యులే! సందేహ మేమి? అంతవఱ కన్ని పనులకు నంతరాయముగ వర్షించుచుండిన మేఘమండలము, ౧౯౩౩ జూను ౫-వ తేది సోమవారమునాఁడు పెండ్లిపందిలివలెఁ బ్రకాశించుచు చల్లఁదనము వెదచల్లి యుల్లాసము గొలుపుచుండెను. అది యచటి వార్షికకందుకక్రీడావినోదములకు కడపటి దిన మగుటం జేసి సదస్సమావేశము సందేహాస్పద మనుకొనుచుండ, మహారాజులుంగారి యాహ్వానమహిమవలననో కవిగారి ఘనతవలననో, విశాఖపట్టణము "టౌను హాలు" సాయంకాలము 5-30 గంట లగునప్పటికి క్రిక్కిఱియసాగెను. విద్యాధికులును విద్యాభిమానులును — పౌరప్రముఖు లించుమించు నన్నూఱుమంది విచ్చేసిరి; సభ సమాప్త మగు పర్యంత మత్యంతోత్సాహముతో నుండిరి. అయిదేండ్ల యీనడుమ, ఇట్టి యింతటి మహాసభ యీ నగరమున జరుగలేదు.

శ్రీయుత భూపతిరాజు వేంకటపతిరాజు, సి. ఐ. ఇ., గారగ్రాసనాధిపత్యము వహించిరి. దైవప్రార్థనానంతరము, సభాధ్యక్షులు కవిగారిని సముచితప్రశంసాపూర్వకముగ సభ్యుల కెఱుకపఱచిరి. కవిగారు "సౌందర్యమంజరి"ని విశేషార్థము లక్కడక్కడఁ దెలుపుచు చదివిరి; మహారాజుగారిని కర్పూరహారాలంకృతులం జేసి, పన్నీరు చల్లి, యత్తరువు పూసి, ఫలపుష్పచందన తాంబూలాదిసమేతము, సభ్యుల కౌతుకకరతాళధ్వనుల నడుమ, శ్రీవారికి కావ్యకన్యాదానము గావించిరి. మహారాజవర్గమువారు సభాధ్యక్షులను కవిగారిని కర్పూరమాలికాలంకృతులం జేసి, చందన తాంబూలాదుల సముచితముగ సత్కరించిరి. శ్రీయుతులు ప్రభల లక్ష్మీనరసింహము పంతులు, కేతవరపు వేంకటశాస్త్రులు, వేటుమల్ల అచ్యుతరావు, పింగళి లక్ష్మీకాంతము గార్లు కావ్యనవ్యతాది గుణంబులను శ్లాఘించుచు, కృతికర్తను కృతిభర్తను మిక్కిలి యభి

నందించిరి. సభాధ్యక్షుల సూచన ననుసరించి, మహారాజులుంగారు కవిగారికిని సభ్యులకును వందనసహస్రంబు లర్పించుచు, "కావ్యకన్యకం బ్రతిగ్రహించితి!" మని చెప్పి యెల్లర సంతోషపెట్టిరి.

బ్రాహ్మణోత్తముల వేదోక్తాశీర్వాద మైన వెనుక, మహారాజులుంగారి యాంతరంగికకార్యదర్శి శ్రీయుత సెట్టి లక్ష్మీనరసింహము గారు సదస్యులకు కృతజ్ఞతాపూర్వకాభివాదంబు లర్పించుచు, తమ కృతికిఁ గాని కవిసార్వభౌముల కృతికిఁ గాని యిట్టి గౌరవము కలుగలే దని శ్లాఘించి, చమత్కారముగ నాగవల్లి నిష్ఠురోక్తులు నాలు గాడి వివాహకార్యక్రమమునకు వన్నె పెట్టిరి. శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారు హరాదుత్సాహభరితులై తమ యప్పగింతలపాటతో పెండ్లివేడుకలను మహావైభవముగ ముగించిరి. సభ్యు లందఱును చందనతాంబూలాదుల సత్కరింపఁబడిరి.

## వధూవరాశీర్వాదము

శ్రీయుతులు కేతవరపు వేంకటశాస్త్రులు గారు

తే. మహితసౌందర్యమంజరి మంజరీస
మాకృతిం దాల్చి, విక్రమత్క్ష్మాతలేశు
చిత్తమధుపంబు రంజింపఁజేసి, దెసల
వెలయుతం గీర్తిపరిమళంబులు చెలంగ!

కం. కృతియుం బతి పతియుం గృతి
యితరేతరరక్తిఁ జెంది, యిద్ధయశస్సం
తతిఁ గాంచి, ధరిత్రిఁ జెలం
గుతఁ జిరకాలంబు కవులు గొనియాడంగన్!

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

81
G 645 Acc. No. 29175

DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

Acc. No. 29175

Call No. T 81 G64S

Author [illegible] K

Title [illegible]

# UNIVERSITY OF HYDERABAD

LIBRARY

HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**